RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 30.01.2025 | సంపుటి : 11 సంచిక : 201 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

మహావిషాదం

ఘటన స్థలంలో కుప్పతెప్పలుగా పడిఉన్న వస్తువులు

మహాకుంభమేళాలో తొక్కిసలాట

తొక్కిసలాట జరిగిన ప్రదేశంలో గుట్టలుగా పడిఉన్న మృతదేహాలు.. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

దుర్ఘటనలో 30మంది మృతి

మరో 60 మందికి పైగా గాయాలు

- మౌని అమావాస్య సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- చీకట్లో ఎటు వెళ్లాలో తెలియక గందరగోళంతో ఘటన
- భారీ చెత్తడబ్బాలు కూడా కారణమంటున్న ప్రత్యక్ష సాక్షులు
- జనం ఎక్కువగా ఉండటంతో ఘటన స్థలానికి అంబులెన్సులు కూడా వెళ్లలేకపోవడంతో పెరిగిన మృతుల సంఖ్య
- దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని
- జ్యుడీషియల్ ఎంక్వైరీకి ఆదేశించిన ముఖ్యమంత్రి యోగి
- సహాయక చర్యలపై యూపీ సీఎంతో ప్రధాని మోదీ సమీక్ష
- ఘటనపై ఆరా తీసిన హోంమంత్రి అమిత్ షా

ప్రయాగ్‌రాజ్(జనంసాక్షి): గత పక్షంరోజులుగా కోట్లాది మంది వచ్చినా.. సాఫీగా సాగిన మహాకుంభమేళాలో అపశృతి చోటుచేసుకున్నది. మౌనా అమావాస్య సందర్భంగా అమృత స్నానంలో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమంకు చేరుకున్న వేళ తొక్కిసలాట చోటు చేసుకుంది. బుధవారం ఇవాళ తెల్ల వారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 30మంది మృతిచెందారని ప్రాథమిక సమచారం. మరో 50 మందికిపైగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టు మార్టం నిర్వహించిన తరవాత మృతదేహాలను మిగతా 2లో..

వీఐపి సంస్కృతి వల్లే తొక్కిసలాట

కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ , మలికార్జున ఖర్గేల విమర్శలు

యూపి సీఎం యోగి రాజీనామా చేయాలని అఖిలేశ్ డిమాండ్

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో తొక్కిసలాట చోటుచేసుకున్న ఘటనలో 30మంది పైగా మృతి చెందగా, అనేకమంది గాయపడినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ఘటనపై స్పందించారు. పాలనా యంత్రాంగం సాధారణ భక్తుల గురించి కాకుండా వీఐపీల తరలింపుపై ప్రత్యేక దృష్టిసారించడమే దీనికి కారణమని ఆయన విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'మహా కుంభమేళా లో తొక్కిసలాట ఘటనలో అనేకమంది మిగతా 2లో..

శతకొట్టిన ఇస్రో

వందో రాకెట్ ప్రయోగం విజయవంతం

నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ రాకెట్-15



తిరుపతి(జనంసాక్షి): ఇస్రో వందో ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ రాకెట్-15 నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసిలోకి తీసుకెళ్లింది. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ మిగతా 2లో..

ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు!

ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర సర్కారు కసరత్తు

- ఫిబ్రవరి 2 తరవాత సమగ్ర సర్వే రిపోర్ట్ ఆధారంగా కేబినేట్ చర్చ
- బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వ్ అయ్యే అవకాశం
- దేశానికే ఆదర్శంగా కులగణన
- రికార్డు వేగంతో ఇంటింటి సమగ్ర సర్వే విజయవంతంపై ముఖ్యమంత్రి హర్షం
- మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్,జనవరి29(జనంసాక్షి): పంచాయతీ ఎన్నికలకు సర్కారు కసర్తత్తును ముమ్మరంచేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేం దుకు సిద్ధమవుతోంది. అయితే కులగణనకు సంబంధించిన నివేదిక ఇప్పటికే పూర్తయిందని తెలుస్తోంది. ఈ లెక్కన బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం. మగ్ర కులగణనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మంత్రులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో తెలంగాణ నిర్వహించిన సమగ్ర కులగణన సర్వే ప్రశంసలు అందుకుందని సీఎం చెప్పారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు. సర్వేకు సంబంధించిన ముసాయిదా నివేదిక సిద్ధమైందని, ఫిబ్రవరి 2వ తేదీ నాటికి కేబినెట్ సబ్ కమిటీకి సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశానికి రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఫిబ్రవరి 2 తరువాత ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిం చేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఓటర్ల జాబితాలను సైతం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. దీంతో ప్లలెలకు కేంద్రం నుంచి గ్రాంట్లు రావడం లేదు. త్వరగా ఎలక్షన్లు నిర్వహిస్తే కేంద్రం నిధులు వస్తాయి. ఫిబ్రవరి 2న కేబినెట్ సబ్ కమిటీకి రిపోర్టు అందితే.. ఆ నివేదికపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై మిగతా 2లో..

ఫిబ్రవరి 10 లోగా సమగ్ర పర్యాటక విధానం

రూపొందించాలి

ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించాలి

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించాలి: సీఎం రేవంత్

2లో

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

ఎలాంటి అక్రమాలు, అవినీతికి తావుఉండకూడదు : మంత్రి పొంగులేటి

మొదటి దశలో 72వేల ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

లబ్ధిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నుంచి బిల్లుల చెల్లింపు వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత వినియోగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మొదటి విడతలో మంజూరైన 72 వేల ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అక్రమాలు, అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపులను ఎక్కడి నుంచైనా నిరంతరం పర్యవేక్షించడానికి మిగతా 2లో..

కొన్ని గ్రామాల్లోనే పథకాల అమలు

సరికాదు

అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలి

సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇళ్లు, రేషన్ కార్డులను అర్హులందరికీ అందించకపోవడం దారుణమని కేంద్రవ మంత్రి మిగతా 2లో..

వైద్యవిద్యలో స్థానికత ఆధారంగా కోటా సరికాదు

ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధం

దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా ఎక్కడివారికైనా చదువుకునే హక్కును ఉంది

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా మిగతా 2లో..

ప్రతిపక్షనేత పదవి కోసం కేటీఆర్, హరీశ్

పోట్లాడుకుంటున్నారు

కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేదా బాధ్యతలు వేరొకరికి అప్పగిస్తారా?

నేను నీతి నిజాయితీకి మారుపేరు.. నాపై ఒక్క కేసు లేదు

పనికిమాలిన మాటలు మాట్లాడితే సహించను

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా.. బండి సంజయ్ ఉన్నరా..!: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తన కాలి గోటికి కూడా సరిపోరని, కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా.. బండి సంజయ్ ఉన్నరా.. అని ప్రశ్నించారు. గద్దర్‌కు అవార్డ్ ఇస్తే తప్పేంటని నిలదీశారు. కాంగ్రెస్ మీటింగ్‌లో పల్లీలు, ఐస్ క్రీంలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ మీటింగ్‌కు రాలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో టీ హాబ్‌కు తాళం వేసిందే కేటీఆర్ అని అన్నారు. కేటీఆర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవని అన్నారు. కేసీఆర్ లా తాను ఎలక్షన్, కలెక్షన్ మిగతా 2లో..

నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు

పచ్చజెండా

క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వయంసమృద్ధి లక్ష్యం

రూ.16,300 కోట్ల వ్యయంతో ఈ మిషన్ అమలుకు కేబినెట్ ఆమోద ముద్ర

సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వయంసమృద్ధి లక్ష్యంగా నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.16,300 కోట్ల వ్యయంతో ఈ మిషన్ అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో మిగతా 2లో..

రుణమాఫీ పేరుతో రైతులను

మోసం చేసిన కేసీఆర్

ఇప్పుడు వారిపై మొసలి కన్నీరు కారుస్తున్నారు

రైతుల కోసం బడ్జెట్‌లో రూ.72 వేల కోట్ల నిధులు కేటాయించాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): రైతులకు సంబంధించి బిఆర్ఎస్‌కు ఏనాడు చిత్తశుద్ధి లేదని, గతంలో వారు చేసిన రుణమాఫీ వ్యవహారమే ఇందుకు నిరదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇప్పుడు అది మరచి పోయి తమను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. భూమికి, విత్తనానికి మధ్య ఎలాంటి బంధం ఉందో.. రైతులతో కాంగ్రెస్ పార్టీకి అలాంటి బంధమే ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీని కూడా ఏకకాలంలో చేయలేదని.. తద్వారా రైతులపై రూ.11,145 కోట్ల మేర వడ్డీ భారం పడిందన్నారు. గతంలో నాట్లు వేసే సమయం కాదు.. కోతల సమయానికి కూడా రైతుబంధు అందించలేదని విమర్శించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మిగతా 2లో..

సౌదీ ఘోర రోడ్డు ప్రమాదంలో

9మంది భారతీయుల దుర్మరణం

పట్టభద్రుల, ఉపాధ్యాయ

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్.. 27న ఎన్నికలు

కేజ్రీవాల్‌కు హరియాణా కోర్టు సమన్లు

ఫిబ్రవరి 17న హాజరుకావాలని ఆదేశం

వరంగల్‌లో ఉగ్ర కదలికలు

పాకిస్తాన్ మిలిటెంట్లతో సంబంధాలున్న జక్రియాను చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

పై వార్తల వివరాలు 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30.01.2025

మహా విషాదం

బంధువులకు అప్పగించనున్నారు. తొక్కిసలాట వల్ల 13 అకాడాలు అమృత స్నానం రద్దు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాళ్లు ప్రకటన జారీ చేశారు. త్రివేణి సంగమంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి ఉదయం సుమారు 70 అంబులెన్సులు చేరుకున్నాయి. దాదాపు మూడు గంటల పాటు తరలింపు పక్రియ జరిగింది. అమావాస్య రోజున స్నానం చేయాలన్న ఉద్దేశంతో.. కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. అధికారులు అంచనా ప్రకారం.. ఇప్పటికే 5 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్ పరిసరాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు సాయంత్రం వరకు ఆ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.మౌని అమావాస్య కారణంగా నెలకొన్న రద్దీతో తొక్కిసలాట ఘటన చోటుచేసుకొని పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అనేకమంది గాయపడ్డారు. ఆ భయానక క్షణాలను కొంతమంది ప్రత్యక్ష సాక్షులు మీడియాతో పంచుకున్నారు. విపరీతమైన రద్దీ వల్ల ఎటు వెళ్లాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొందని తెలిపారు. చీకట్లో కన్పించని చెత్త బుట్టలు కాళ్లకు తగలడంతో చాలామంది కింద పడిపోయారని పేర్కొన్నారు. 'తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మౌని అమావాస్య నేపథ్యంలో త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు ఒక్కసారిగా భక్తులు బయల్దేరారు. తలపై పెద్దపెద్ద లగేజీలతో భక్తులు తరలివచ్చారు. అయితే, ఎటునుంచి వెళ్లాలి.. ఎక్కడ స్నానమాచరించాలన్న దానిపై ఎవరికీ అవగాహన లేదు. పైగా.. యాత్రికుల కోసం ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఇనుప చెత్త డబ్బాలను ఏర్పాటుచేశారు. చిమ్మచీకట్లో అవి ఎవరికీ కన్పించలేదు. దీంతో వాటికి తగిలి చాలామంది కింద పడిపోయారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగింది' అని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. చెత్త డబ్బా తగిలి తాను కూడా కింద పడిపోయాయని, ఎలాగోలా అక్కడినుంచి కుటుంబంతో బయటపడ్డానని చెప్పారు. వేరే భక్తులను కాపాడే క్రమంలో స్వల్పంగా గాయపడినట్లు వివరించారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ.. 'ఈ ప్రాంతం నుంచి బయటకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి. దానివల్లే పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. చాలామంది మా కళ్ల ముందే కింద పడిపోయారని తెలిపారు. త్రివేణి సంగమానికి కిలోమీటరు దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. భక్తులంతా సంగమం ప్రధాన ఘాట్ వద్దే స్నానాలు చేసేందుకు యత్నించగా ఆ మార్గంలోని బారికేడ్లు విరిగి తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే, మృతుల సంఖ్యపై యూపీ సర్కారు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. తొక్కిసలాట ఘటనతో త్రివేణి సంగమం వద్ద కొంతసేపు పుణ్య స్నానాలను నిలిపివేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత పునరుద్ధరించారు. మౌని అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పెద్దఎత్తున ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు దాదాపు 3 కోట్ల మంది పుణ్య స్నానమాచరించినట్లు అధికారులు తెలిపారు. 12 పూర్ణ కుంభమేళాలతో సమానమైన మహా కుంభమేళాను 144 ఏళ్లకోసారి నిర్వహిస్తారు. అందుకే ఈసారి భక్తుల తాకిడి విపరీతంగా ఉంది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు కొనసాగనుంది. ఇప్పటివరకు 20 కోట్ల మందికి పైగా భక్తులు కుంభమేళాను దర్శించుకొని పుణ్య స్నానాలు ఆచరించారు.

దుర్ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని,తీవ్ర దిగ్భ్రాంతి

మహాకుంభ్ దుర్ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణ సహాయక చర్యలకు ముఖ్యమంత్రి యోగి ఆదేశించారు. ఘటన జరిగిన వెంటనే ప్రధాని మోడీ ఇప్పటికే మూడుసార్లు యోగితో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కుంభమేళా పరిస్థితి పై ప్రధాని మోదీ సమీక్షిస్తూనే ఉన్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ప్రధాని ఆదేశించారు. యూపీ ప్రభుత్వ అధికారులతో ఆయన టచ్‌లోనే ఉన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యల్ని ఆయన సూచించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కూడా యూపీ సీఎంతో పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మహాకుంభమేళా లో తొక్కిసలాట జరగడంతో భక్తులకు యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు. గంగామాతకు సమీపంలోని ఘాట్ వద్ద స్నానాలు చేయాలని సూచించారు. త్రివేణి సంగమం కేంద్రం వైపు వెళ్లి మొక్కులు చెల్లించడానికి ఎవరూ వెళ్లందంటూ భక్తులను కోరారు. అమృత స్నానం కోసం చాలా ఘాట్‌లు ఏర్పాటు చేశామని, అక్కడ స్నానాలు చేయాలని కుంభమేళాలో ప్రచారం చేశారు. మౌని అమవాస్య సందర్భంగా యుపిలోని ప్రయాగ్ రాజ్‌కు భక్తులు తండోపతండాలుగా తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 20మృతి చెందగా 50 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళాలో విషాదం చోటుచేసుకోవడంతో అంతా దిగ్భ్రాంతి నెలకొంది. మౌని అమావాస్య సందర్భంగా నెలకొన్న రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. 'ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో చోటుచేసుకున్న విషాదం తీవ్ర విచారకరం. ఈ ఘటనతో తమ ప్రియమైన వారిని కోల్పోయిన భక్తులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులకు స్థానిక యంత్రాంగం అన్నివిధాలా సాయం చేస్తోంది. దీని గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోనూ మాట్లాడా. రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా' అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం భక్తులు పోటెత్తారు. ఈక్రమంలోనే బుధవారం తెల్లవారుజామున రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. బారికేడ్లు విరగడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 20 మంది మృతిచెందినట్లు పలు మీడియా కథనాలు చెబుతున్నాయి. అయితే, యూపీ సర్కారు మాత్రం మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

కేజ్రీవాల్‌కు హరియాణా కోర్టు సమన్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆమ్‌ఆద్మీ పార్టీ చీఫ్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు హరియాణా కోర్టు సమన్లు జారీ చేసింది. దిల్లీకి నీటి సరఫరాను అడ్డుకొనేందుకు హరియాణా పాలకులు యమునా నదిని విషపూరితం చేశారంటూ దిల్లీ ఎన్నికల వేళ ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. దీంతో కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై హరియాణా ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. యమునా నది నీటిని విషపూరితం చేసినట్లు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే చేసిన అసత్య వ్యాఖ్యలతో అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌కు హరియాణా కోర్టు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 17న కోర్టులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ రోజు విచారణకు హాజరు కాకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ సోనిపట్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు (సీజేఎం) నోటీసులు జారీ చేసింది. కేజ్రీవాల్ తన ఆరోపణల వెనుక ఉన్న కారణాలను వివరించాలని, హరియాణా ప్రభుత్వం యమునా నది నీటిని విషపూరితం చేస్తుందన్న వాదనలను ధ్రువీకరిస్తూ నివేదిక ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. అంతకుముందు కేజ్రీవాల్ వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యమంటూ హరియాణా మంత్రి విపుల్ గోయల్ తీవ్రంగా స్పందించారు. "కేజ్రీవాల్ మా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణల వల్ల హరియాణా, దిల్లీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తుంటే మేము ఊరికే విడిచిపెట్టం. దీనిపై తగిన చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ మాటలు అవాస్తవమని నిరూపిస్తాం" అని మండిపడ్డారు.

నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు పచ్చజెండా

స్వావలభనం సాధించడం, ఖనిజాల దిగుమతులపై ఆధారపడటం తగ్గించడం కేంద్రం లక్ష్యమన్నారు. ఈ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేందుకు ప్రభుత్వం గత రెండేళ్లుగా పలు చర్యలు తీసుకుందన్నారు. ఈ రంగంలో స్వావలంభన సాధించాలనే విజన్‌కు అనుగుణం గా 2024-25 బడ్జెట్‌లో క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని గుర్తు చేశారు. అరుదైన ఖనిజ వనరులు ఉన్న దేశాలతో వాణిజ్యాన్ని మెరుగుపరచుకోవడం, దేశీయంగా ఖనిజ నిల్వల అభివద్ధికి దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటీ కంపెనీలను నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రోత్సిహిస్తుందని మంత్రి చెప్పారు.

వైద్యవిద్యలో స్థానికత ఆధారంగా కోటా సరికాదు

నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. మనమంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం కాబట్టి ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా" అని ధర్మాసనం వెల్లడించింది.నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే అని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది.పీజీ మెడికల్ కోర్సులకు నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని గతంలో పంజాబ్-హరియాణా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. ఇద్దరు సభ్యుల ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈక్రమంలోనే తాజా తీర్పు వెలువడింది.

ప్రతిపక్షనేత పదవి కోసం కేటీఆర్, హరీశ్ పోట్లాడుకుంటున్నారు

చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ కత్తులతో పొడుచుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా భట్టి పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, కేసీఆర్ బడ్జెట్ సెషన్‌కు వస్తారో.. రారో చెప్పాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. చాల రోజుల గ్యాప్ తర్వాత ముఖాముఖీ కార్యక్రమం జరుగుతోంది. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుండి మంత్రి వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గాంధీ భవన్‌కు చాలా మంది వస్తున్నారు. కాగా తెలుగు సినీ ఇండస్ట్రీకి తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం డబ్బింగ్ థియేటర్ నిర్వాహకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు.

సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదంలో 9మంది భారతీయుల దుర్మరణం

న్యూఢిల్లీ(జనంసాక్షి): సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మృతుల కుటుంబ సభ్యులతో పాటు భారత్‌లోని అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని.. వారికి పూర్తి సహకారం అందిస్తున్నట్లు 'ఎక్స్'లో తెలిపింది. అయితే, ఈ ప్రమాదం ఎలా జరిగింది? మృతులు ఏయే ప్రాంతాలకు చెందినవారనే వివరాలు మాత్రం తెలియలేదు. 'సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మంది భారతీయులు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. బాధిత కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ పూర్తి సహకారం అందిస్తోంది. భారత్‌లోని అధికారులు, బాధిత కుటుంబాలతో టచ్‌లో ఉన్నాం. ఈ ఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. వివరాల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు 8002440003(టోల్ ఫ్రీ), 0122614093, 0126614276, 0556122301ఏర్పాటు చేశాం' అని పేర్కొంది.

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు. తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్, ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్-నిజామాబాద్, ఆదిలాబాద్ - కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్ -నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక ఈ జిల్లాల్లో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. మెదక్ -నిజామాబాద్- ఆదిలాబాద్ - కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి ప్రస్తుతం జీవన్ రెడ్డి(కాంగ్రెస్) కొనసాగుతున్నారు. మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ టీచర్ స్థానం నుంచి కూర రఘోత్తం రెడ్డి, వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ స్థానం నుంచి అలుగుబెల్లి నర్సి రెడ్డి కొనసాగుతున్నారు. ఈ ముగ్గురి పదవీకాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది. నోటిఫికేషన్ విడుదల ఫిబ్రవరి 3న వెలుబనుండగా, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 10,నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 13 వరకు ఉంటుంది. పోలింగ్ ఫిబ్రవరి 27 (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు) జరుగుతాయి. ఓట్లను మార్చి 3వ తేదీని లెక్కించి విజేతలను ప్రకటిస్తారు.

వీఐపి సంస్కృతి వల్లే తొక్కిసలాట

భక్తులు ప్రాణాలు కోల్పోవడం, గాయాలపాలవడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా. పాలనా యంత్రాంగం సాధారణ భక్తుల గురించి కాకుండా.. వీఐపీల తరలింపుపై ఎక్కువ దృష్టిపెట్టడమే ఈ విషాద సంఘటనకు కారణం. ఈ మహా కుంభమేళాలో మహాస్నానాలు ఇంకా అనేకం జరగాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఇలాంటి విషాదకర ఘటనలు పునారావృతం కాకుండా వ్యవస్థను మెరుగుపరచాలి. వీఐపీ సంస్కృతిని అరికట్టి.. సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. అరకొర ఏర్పాట్లే ఈ ప్రమాదానికి కారణమని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. రూ.వేల కోట్లు ఖర్చు పెట్టినా ఏర్పాట్లు అంతంతమాత్రంగా ఉండటం శోచనీయమన్నారు. భక్తుల సౌకర్యాల కంటే స్వీయ ప్రచారం పైనే ఎక్కువ దృష్టి పెట్టారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయన విరుచుకుపడ్డారు. ప్రభుత్వం మేలుకొని సాధారణ భక్తులకు మౌలిక వసతులు కల్పించి.. వీఐపీల రాకపోకలను నియంత్రించాలన్నారు. కుంభమేళాలో జరిగిన ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సైతం స్పందించారు. దీని నిర్వహణ నుంచి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను తొలగించాలని ఆయన ఈసందర్భంగా డిమాండ్ చేశారు. నిర్వహణ లోపమే ఈ ఘటనకు కారణమన్నారు. కుంభమేళా నిర్వహణను సైన్యానికి అప్పగించాలన్నారు. ఈ ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ యోగి రాజీనామా చేయాలని అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.

కొన్ని గ్రామాల్లో పథకాల అమలు సరికాదు

బండి సంజయ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 70లక్షల మంది రైతులుంటే.. ఇప్పటివరకు 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయలేదని చెప్పారు. 10 లక్షల మంది వ్యవసాయ కూలీలుంటే నేటికీ 9 లక్షల 80 వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు ఎందుకు వేయడంలేదని ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంజయ్ లేఖ రాశారు.'40 లక్షల కొత్త రేషన్ కార్డులిస్తామని 42,267 మందిని మాత్రమే గుర్తించడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలు అర్హులైనప్పటికీ, నేటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా ఇంటిని నిర్మించకపోవడం సిగ్గు చేటు. ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర బ్జడెట్‌లో రూ.7 వేల కోట్లకుపైగా కేటాయింపులు చేసినా.. నయాపైసా ఖర్చు చేయకపోవడం దారుణం. ముఖ్యమంత్రే ఇచ్చిన హామీలనే అమలు చేయలేకపోతే.. మీ నేతృత్వంలో పనిచేసే అధికారులు ఏ విధంగా జవాబుదారీతనంతో పనిచేయగలరు?. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర సర్కార్ విఫలమైంది. ఇకనైనా అర్హులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇళ్లను అందించాలి' అని లేఖలో బండి సంజయ్ డిమాండ్ చేశారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

ఏఐని వినియోగించాలన్నారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేసినట్లు మంత్రి వివరించారు. మొబైల్ యాప్ సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో సరిపోల్చి.. అనర్హులను గుర్తించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన కేసీఆర్

రాష్ట్ర బడ్జెట్‌లో రూ.72 వేల కోట్ల నిధులు వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించినట్లు తుమ్మల చెప్పారు. 'పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ రైతులు పడిన ఇబ్బందులు గమనించాం. వారి కన్నీరు తుడవడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశాం.

వరంగల్‌లో ఉగ్ర కదలికలు

వరంగల్(జనంసాక్షి):

వరంగల్‌లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి పాకిస్తాన్ ఉగ్రవాదులతో లింకులు ఉన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పుమన్నాయి. ఉగ్రవాదుల కదలికల ప్రచారంతో వరంగల్‌లో తీవ్ర కలకలం రేగుతోంది. వరంగల్ జానిపీరీలకు చెందిన జక్రియాకు పాకిస్తాన్ టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయని నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ మేరకు అతన్ని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 25న శ్రీలంకకు వెళ్తుండగా.. జక్రియాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, కొంతకాలంగా వరంగల్ శివనగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద నిందితుడు జక్రియా బిర్యానీ సెంటర్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. అతనికి కొన్నేళ్లుగా పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు!

దానిని ఆమోదిస్తుంది. తర్వాత బీసీ గణనకు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఎలాంటి అడ్డంకులు రాకుండా ఉండేందుకు న్యాయనిపుణులతో రివ్యూ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రకియను ఫిబ్రవరి రెండో వారంలోగా నిర్వహించాలని నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఫిబ్రవరి 2లోపు డెడికేషన్ కమిషన్ రిపోర్టు ఇవ్వనుంది. రిపోర్టు వచ్చిన తర్వాత మరోసారి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఫిబ్రవరిలోనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. కానీ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం తర్జన భర్జనకు గురవుతోంది. ఫిబ్రవరి 2 లోపు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని డెడికేషన్ కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2 తరువాత మరోసారి సమావేశమై పంచాయతీ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. రిజర్వేషన్లపై పాత పద్ధతిలోనే వెళ్లాలా లేక న్యాయ స్థానాలలో పెంచుకునే అవకాశం పొందాలా అనేదానిపై సర్కార్ తర్జన భర్జనకు గురవుతోంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో ఎలక్షన్స్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు.అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. సెప్టెంబర్ 12వ తేదీన ఇంటింటి సర్వే కుల గణన చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటయిన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది. అక్టోబర్ 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. అక్టోబర్ 10వ తేదీన ప్రణాళిక విభాగం సర్వేకు సంబంధించిన పూర్తి విధి విధానాలతో జీవో నెం.18 జారీ చేసింది.

ఫిబ్రవరి 10 లోగా సమగ్ర పర్యాటక విధానం రూపొందించాలి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి 10వ తేదీలోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాల ప్రాతిపదిక చేసుకొని పాలసీని రూపొందించాలని సీఎం సూచించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర పర్యాటక విధానంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. దేశీయంగా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పర్యాటక పాలసీలతో పాటు అంతర్జాతీయంగా ప్రముఖమైన పాలసీలను అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక పాలసీ రూపొందించాలని ము

ధరణి పాపాలకు కేసీఆర్, కేటీఆరే కారణం

- దివాళా తీసిన అమెరికా కంపెనీకి ధరణిని అప్పగించారు
- వారి నిర్వాకం వల్లే రైతులకు కష్టాలు
- వ్యవసాయ రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ కోదండరెడ్డి

పాలకుర్తి, జనవరి 29 (జనంసాక్షి) : రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆరేలు ధరణి పోర్టల్‌ను తీసుకురావడం వల్లే భూసమస్యలు పెరిగాయని, దీంతో రైతులకు కష్టాలు వచ్చాయని వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ ఏ. కోదండరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్లో లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో భూ భారతిపై రైతులకు ఆవగాహన సదస్సు నిర్వహించగా, భూభారతి రూపకర్త భూమి సునీల్, ఎమ్మెల్సీ కోదండరాంలతో కలిసి ముఖ్యఅతిదిగా కమీషన్ చైర్మన్ కోదండరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల పక్షాన భూసమస్యలు పరిష్కరించాలని అప్పటి చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌ను రేవంత్రెడ్డి, భట్టి విక్రమార్కలతో కలిసి వినతి పత్రం సమర్పించామని గుర్తు చేశారు. చీఫ్ సెక్రటరీ నిర్లక్షం వ్యవహరించారని అన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు నాటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్రెడ్డి భూసమస్యలపై కమిటి వేయగా, దానిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పర్యటించానని అన్నారు. భూములపై హక్కు ఉన్నప్పటికి పాసుపుస్తకాలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ధరణిని బంగాళాఖాతంలో వేస్తానని రేవంత్రెడ్డి ప్రతిన బూనాడని, దానిలో భాగంగానే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం భూభారతిని తీసుకువచ్చాడని తెలిపారు. భూహక్కులు కల్పిస్తామని చెప్పడమే కాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోలో సైతం ఈ అంశాన్ని చేర్చిందని గుర్తుచేశారు. కేవలం రైతుల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు, చెప్పడమే కాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోలో నైతం ఈ అంశాన్ని చేర్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే నన్ను, భూమి సునీల్ను పిలిపించి ధరణీపై అధ్యయనానికి కమిటి వేసి భూసమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్రెడ్డి తన చిత్తశుద్ధిని చూపాడన్నారు.. 2020లో ఆర్ఆర్ చట్టం లోపభూయిష్టంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో ఆంఆర్ చట్టం తేవడం కాకుండా ధరణి అనే పేరును మార్చి భూభారతి పేరు పెట్టారని గుర్తుచేశారు.ధరణి పేరిట భూరికార్డులు అన్ని అమెరికా కంపెనీ చేతిలో పెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నించిందని అన్నారు. ధరణి వల్ల బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు వాళ్ల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ధరణి నిర్వహిస్తున్న అమెరికా కంపెనీ పై ఆరా తీస్తే అది దివాలా తీసిన కంపెనీగా తేలిందని అన్నారు. ఆ కంపెనీకి రెవెన్యూ రికార్డులు భద్రపరిచే సామర్థ్యం లేదని తేలిందని అన్నారు. రైతులను పట్టాదారులను మోసగించిన విషయంలో అప్పటి సీఎం కేసీఆర్. రెవెన్యూ, ఐటీ మంత్రులు దోషులని విమర్శించారు. ఆర్ ఓ ఆర్ చట్టం భూభారతి పోరల్ తీసుకువచ్చామని, త్వరలోనే అందుకు సంబంధించిన నియమ నిబంధనలు అమల్లోకి ప్రభుత్వం తీసుకు వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ బడా భూస్వాములు, రియలేస్టేట్ వ్యా పారుల కోసం ధరణి చట్టాన్ని తీసుకు వచ్చారని విమర్శించారు. 1970 తర్వాత కాంగ్రెస్ భూసంస్కరణ చట్టం తీసకువచ్చిందని గుర్తుచేశారు. అప్పటి రైతులు నమ్మకంతోనే సాదా కాగితంపై రాయించుకున్న పత్రాలు మాత్రమే ఉండేవి. కానీ రైతులు ఎవరు రిజిస్ట్రేషన్ చేయిం చుకోలేదని. ధరణి వచ్చిన తర్వాత రైతుల భూములు పెద్ద రైతుల చేతుల్లోకి వెళ్లాయని విమర్శిం చారు. ఖాస్తుకాలం లేకుండ చేయడం వల్లనే రైతులు ఇంత ఇబ్బందిపడుతున్నారు. అయితే కాం గ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. భూభారతి రూపకర్త భూమి సునీల్ మాట్లాడుతూ ధరణి లోపాల వల్లనే పట్టాదార్ పాసుపుస్తకాలు అందలేదని అన్నారు. ధరణి రాకముందు 70 భూసమస్యలు ఉండగా, ధరణి అమల్లోకి వచ్చాక అదనంగా 50 భూసమస్యలు పెరిగాయని మొత్తం 120 భూసమస్యలతో రైతులు ఇబ్బం దిపడుతున్నారని అన్నారు. ధరణి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 21 లక్షల మంది రైతులు దరఖాస్తు చేశారని గుర్తు చేశారు. ధరణిలోని భూసమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకు వచ్చిందని తెలిపారు. త్వరలోనే భూభారతి చట్టం అమల్లోకి వస్తుందని ఈ చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ధరణి చట్టం భూస్వాముల కోసమే ఆ ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. నిరుపేదల కోసం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి భూభారతిని తీసుకువచ్చారని దీంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఇక నుంచి రైతులకు ఏ సమస్య ఉండబోదని అన్నారు. ఈ సదస్సులో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు భవాణి, వెంకన్న, అదనపు కలెక్టర్ రోహిత్సింగ్, లీఫ్స్ అడ్వయిజర్ కర్ణాకర్ దేశాయి. పాలకుర్తి, తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు లావుడ్యా మంజుల, అనుమాండ్ల తిరుపతిరెడ్డి. జనగామ, తొర్రూరు, స్టేషన్ఘన్పూర్ ఆర్డీవోలు, ఆరు మండలాల తహసీలార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రెండున్నర కోట్లతో సిసి రోడ్డు అభివృద్ధి నిధులు మంజూరు

- అభివృద్ధి ప్రదాత మంత్రి సీతక్క
- కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు ఎర్రబెల్లి మనోజ్

ఏటూరునాగారం, జనవరి 29 (జనంసాక్షి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ముక్కెర లాలయ్య ఇంటి నుండి. సాంబశివరావు ఇంటి వరకు రెండున్నర కోట్లతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు మంత్రి దానసరి అనసూయ సీతక్క కృషితో నిధులు మంజూరు చేశారు. సిసి రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు ఎర్రబెల్లి మనోజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ గల్లీ గల్లీకి సిసి రోడ్ల నిర్మాణానికి ఎనలేని కృషిచేసి నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిధులు మంజూరు కోసం సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులకు. ఎర్రబెల్లి మనోజ్ ధన్యవాదాలు తెలిపారు. ఏటూరునాగారం మండలాన్ని రాష్ట్రస్థాయిలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్లి ఆదర్శ మండలం గా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మండలానికి ఇప్పటికే సెంట్రల్ లైటింగ్, ఆర్టీసీ బస్ డిపో, ఫైర్ స్టేషన్, బురద రోడ్లు లేకుండా అనేక గ్రామాలలో గల్లీలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని. సీతక్క కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

బడిపంతులుగా మారిన ఐటీడీఏ పీవో



భద్రాచలం, జనవరి 29 (జనంసాక్షి) : భద్రాచలం ఐటిడిఏ పిఓగా విధులు నిర్వహిస్తున్న రాహుల్ కూడా.. నిత్యం ప్రజల్లో తిరుగుతూ క్షేత్రస్థాయిలో గిరిజన ప్రాంతాలను పర్యవేక్షిస్తూ వారికి ఆర్థిక స్వాలంబన కలిగించేందుకు తన ఆలోచనలకు పందును పెడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం ఏజెన్సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్. మొదటగా చిరుమళ్ళ ఆశ్రమ పాఠశాలలో తనిఖీ నిర్వహించిన ఆయన ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండి, పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు అని తెలుసుకున్న పిఓ వచ్చే ఎండాకాలంలో డైనింగ్ హాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అనంతరం వట్టం వారి గుంపులోని మరో గిరిజన పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారితో కలిసి కూర్చుని బోర్డులపై రాయిస్తూ పాఠాలెలా నేర్చుకోవాలో సూచించారు. వారితో ముచ్చటిస్తూ విద్యే మన తలరాతను మారుస్తుందని మంచిగా చదువుకోవాలని జీవితంలో ఒక ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఇస్రో వందో రాకెట్ ప్రయోగం

- దేశానికి గొప్ప విజయం : హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి29 (జనంసాక్షి) : ఇస్రో వందో ప్రయోగం విజయవంతంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో వందో రాకెట్ ప్రయోగం భారతదేశానికి ఒక గొప్ప విజయమని ప్రశంసించారు. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎన్వీఎస్-02 ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ అని.. దీంతో మన సైంటిస్టుల ప్రతిభ అని పేర్కొన్నారు. దేశానికి గర్వకారణమైన రోజు ఇవాళ అని హరీశ్‌రావు ప్రశంసించారు. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

ముస్లింల విద్యా ప్రమాణాలను పెంచుతాం

- అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పణ
- సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

కరీంనగర్, జనవరి 29 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2025 గైడ్స్ ను కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 24 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరపున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరంలో ఎంఐఎం పార్టీ నగర శాఖ కలిసికట్టుగా నగరవ్యాప్తంగా అనేకమైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దారుస్సలాం ఏర్పాటు చేసి, ప్రజా సమస్యల ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం అభినందనీయమన్నారు. ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 30 పాఠశాలలను స్థాపించి, 30 వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత చెడు వ్యసనాలను మాని ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హాఫిజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, ఆతిన, ఖాజా, కోశాధికారి ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్ నాయకులు అలిబాబా, అజర్ దబీర్, సర్వర్ షా బియబాని, షాకిర్ నహ్ది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై నోరేపారేసుకున్న మక్కాన్‌సింగ్

పెద్దపల్లి, జనవరి 29 (జనంసాక్షి) : రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లులో భాగంగా తెలంగాణకు భారత ప్రభుత్వం 2400ల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో 800ల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించగా మరో 800ల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రాజెక్టును నిర్మించనుంది. ఇందులో భాగంగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్? ఫేజ్-2 పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా రామగుండంలోని జ్యోతిగనర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు దాదాపుగా 800ల మంది వరకు పోలీసులను మోహరించారు. పెద్ద ఎత్తున పోలీసు పహరా నడుమ ప్రజాభిప్రాయ సేకరణను పూర్తి చేయగా కార్యక్రమం ప్రారంభానికి ముందే రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను అరెస్టు చేసి మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీసు స్టేషన్‌కు తరళించగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వందల మంది నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, హౌజ్ అరెస్టులు చేశారు. అయితే ఇదే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్పార్టీ అధ్యక్షుడు మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌తో పాటుగా ఆయన అనుచరులు పోలీసులపై తిరగబడ్డారు. ప్రజాభిప్రాయ సేకరణ వీఐపీ గేట్ వద్దకు ఎమ్మెల్యే తన వాహణ కాన్వాయ్‌తో ప్రవేశించేందుకు ప్రయత్నించగా అక్కడ ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింలు వారిని అడ్డుకున్నారు. ఒక్కరే వెళ్లాలని చెప్పడంతో ఎమ్మెల్యేతో పాటుగా ఆయన అనుచరులు ఏసీపీపై తిరగబడ్డారు. నా వాహనాన్ని ఆపిన ఆ పాగల్ గాడు ఎవడంటూ ట్రాఫిక్ ఏసీపీపై ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మండిపడ్డారు. ఇదే సమయంలో ఆయన అనుచరులు ఇది కాంగ్రెస్ రాజ్యాంగం అంటూ చేతులతో నెట్టేసి ఏసీపీపై దాడికి దిగే ప్రయత్నం చేశారు. చోద్యం చూస్తూ ఏసిపికే గొడవ వద్దంటూ తోటి పోలీసులు, ఏసీపీ మదత రమేష్‌లు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ వాహనాన్ని ఆ మార్గంలో వెళ్లోద్దని ఆపిన ట్రాఫిక్ ఏసీపీకి పరాభావం ఎదురయ్యింది. తన వాహనాన్ని ఆపిన ఆ పాగల్ గాడు ఎవడంటూ ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులును ఎమ్మెల్యే తిట్టడంతో ఏసీపీ సైతం అదే స్థాయిలో ప్రతిఘటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

ప్రమాదకరంగా రామన్నగూడెం, రాంనగర్ రహదారి

ఏటూరునాగారం, జనవరి 29 (జనంసాక్షి) : మండలంలోని రామన్నగూడెం, రాంనగర్ మీదుగా కమలాపురం వరకు గడిచిన సంవత్సరం వేసవి కాలంలో వేసిన తారు, రామన్నగూడెం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ కి అమర్చిన మెయిన్ పైపు లీకేజీ తో కొన్ని నెలల నుండి నీరు లేకేజీతో అక్కడ రోడ్డు మీద పెద్ద గుంత పడింది. రాంనగర్ మీదుగా రామన్నగూడెం ప్రారంభంలో కరకట్ట మీదుగా రోడ్డు దిగి రావాలి అక్కడ పడ్డ గుంత అటు నుండి వచ్చే వాహనాలకు సరిగా కనపడదు అదుపు తప్పి గుంతలో పడితే ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న, రోడ్డుపై పడిన గుంతలో వాహనాలు దిగబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోక పోవడం వలన రామన్నగూడెం, రాంనగర్, లంబాగూడెం ప్రజలు రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించి వాహనదారులు ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ విద్యా విభాగం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్‌గా కొట్టే సతీష్

కాటారం, జనవరి 29 (జనం సాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారేపెల్లికి చెందిన కొట్టే సతీష్ బ్యాచిలర్ అఫ్ ఇంజినీరింగ్ జేఎన్టీయూ హైదరాబాద్ లో పట్టా తీసుకుని ,లండన్ లో ఉన్నత చదువులు చదివి , కాకతీయ యూనివర్సిటీ నుండి గ్రామీణ అభివృద్ధి మీద పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రస్తుతం శాతవాహన యూనివర్సిటీ లో లా కోర్స్ చదువుతూ అలాగే స్వయంకృషి స్వచ్ఛంద సంస్థని స్థాపించి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు, ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా జయశంకర్ భూపాలపల్లి లోని కాటారం సబ్ డివిజన్ పరిధిలో అనేక మంది పేద పిల్లలు చదువుకోవడంలో సహాయం అందించారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ వారి ద్వారా మోటివేషనల్, పరీక్షలు అంటే భయం టాపిక్ మీద ఎన్నో తరగతులు నిర్వహించారు. ఐటిఐ కళాశాలలో విద్యార్థినిలకు మరుగుదొడ్డి నిర్మించి ఇచ్చినారు ఇటువంటి ఎన్నో సేవ కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యా విభాగంలో వీరు చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ వారు కొట్టే సతీష్‌ను భూపలపల్లి జిల్లా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ విద్యా విభాగం కన్వీనర్‌గా నియమించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గుగులోత్ మధుసూదన్ ఎంపిక

స్టేషన్ ఘన్పూర్, జనవరి 29 (జనంసాక్షి) : నవంబర్ మాసంలో నిర్వహించిన 68 వ స్కూల్ గేమ్స్ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ 14 సంవత్స రాల బాల బాలికల ఎంపికలు వరంగల్ లో నిర్వహిం చగా జడ్పిహెచ్ఎస్ శివునిపల్లి పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థి గుగులోత్ మధుసూదన్ క్రీడలలో మంచి ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనదని పాఠశాల ప్రధానోపాధ్యాయు డు కుసుమ రమేష్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొండా రవి తెలిపారు.ఈ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 30,31 వ తేదీలలో మెదక్ జిల్లాలోని తూప్రాన్ లో నిర్వహించ నున్నారని తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కైన విద్యార్థి మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరడం జరిగింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని క్రీడా పోషకులు , పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్, దస్తగిరి, ప్రభాకర్, గోలి రాజశేఖర్ అభినందించారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ములుగు బ్యూరో,జనవరి29(జనం సాక్షి): ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, సివిల్ సప్లై డిఎం రాంపతి ల చేతుల మీదుగా ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ హరినాథ్, ఉపాధ్యక్షులు అక్కల రఘోత్తం,రైస్ మిల్లర్లు రేపాల సత్యం, ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ములుగు జిల్లా రైస్ మిల్లర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 జనవరి 2025
తెలంగాణ

శత ప్రయోగాల వేదిక శ్రీహరికోట

శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి నుండి జనవరి 29న తన 'వందవ' ప్రయోగం జిఎస్ఎల్వి - ఎఫ్15 ద్వారా ఎన్విఎస్ - 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగిలోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరి వారంలో స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా ప్రయోగించిన పిఎస్ఎల్వి సి - 60 షార్ నుంచి చేసిన 99వ ప్రయోగం. తొలి ప్రయోగం చేసిన 46 ఏళ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఈ ప్రయోగంలో పాలుపంచు కున్న ప్రతీ ఒక్కరూ అభినందనీయులే! ఇది ప్రతీ భారతీయు ని విజయం. ఈ సందర్భంగా ఒకసారి మన అంతరిక్ష విజయ పరంపరను పునరావలోకనం చేసుకుందాం.

తొలినాళ్ళలో:

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే దేశ రక్షణ అవసరాలు, అభివృద్ధికి అంతరిక్ష పరిజ్ఞాన అవసరాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనా వ్యవస్థను ఏర్పరచేందుకు సన్నాహాలు మొదలు పెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడయిన విక్రం సారాభాయ్ 1957లో రష్యా మొట్టమొదటి ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించిన తరువాత మనదేశానికి కూడా ఉపగ్రహ అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు తెలియజేసి 'సాంకేతిక పరిజ్ఞాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చేటప్పుడే మన దేశంలోని ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చని ఒప్పించి, 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ భాభా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఇన్‌కోస్పార్)ను ఏర్పరచారు. భవిష్యత్తులో ఇతర దేశాలు ఉపగ్రహానికి కావలిసిన సకల పరికరాలను అందించక పోవచ్చని ముందుగానే ఊహించిన సారాభాయ్ అవసరమ యిన అన్ని భాగాలనూ దేశీయంగానే తయారు చేసే దిశగా ప్రయత్నం చేసారు. 1969లో ఇన్‌కోస్పార్ ఇస్రోగా రూపొం దింది. ఉపగ్రహాలను తయారు చేయడంతో పాటు వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యక తను గుర్తించిన సారాభాయ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎల్వి) ఉపగ్రహ వాహకనౌక రూపకల్పనకు నాంది పలికారు.

స్థల అన్వేషణ:

మొదటి నుండి ఉపగ్రహాల నిర్మాణాన్నే దృష్టిలో పెట్టుకొని దానికి అవసరమయిన భూ ఉపరితల లక్షణాలను అధ్యయ నం చేసేందుకు కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరి యల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. కానీ దీని చుట్టూ జనసంచారం ఎక్కువగా ఉండడం, పైగా ఆ కేంద్రం మినీ రాకెట్ ప్రయోగాలకే పరిమితం కావడం కారణాన్న భవిష్యత్తులో చేయబోయే భారీ రాకెట్ ప్రయోగాల దృష్ట్యా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం మరోచోట రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అనువైన రాకెట్ ప్రయోగ కేంద్ర స్థలం కోసం అన్వేషణలో అన్ని ప్రాంతాలనూ పరిశీలిస్తూ రాగా శ్రీహరికోట దీవి ఆయన కంటపడింది.

శ్రీహరికోట ప్రత్యేకత:

రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు ఎంత దగ్గరగా ఉంటే భూమ్యాకర్షణను అధిగమించి పైకి వెళ్ళేందుకు రాకెట్‌కు అంత తక్కువ ఇంధనం ఖర్చౌతుంది. శ్రీహరికోట భూమధ్యరేఖకు దగ్గరగా ఉండడం ఇస్రో ఈ స్థలాన్ని ఎంచుకోవడానికి ఒక కారణం. భౌగోళికంగా సాంకేతికం గా, ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న ఫ్రెంచి గయానాలోని కౌరు రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు కేవలం ఏడు డిగ్రీల అక్షాంశంలోనూ, ఎంతో గొప్పదిగా చెప్పుకునే అమెరికాలోని కేఫ్ కెన్నెడీ రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు 28 డిగ్రీల అక్షాంశంలోనూ ఉండగా శ్రీహరికోట 13 డిగ్రీల 43 సెకండ్ల అక్షాంశం మీద ఉంది. భూమధ్య రేఖకు అత్యంత దగ్గరగా ఉన్న కేంద్రాల్లో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఇంకా రాకెట్ ప్రయోగ దిశలో భూభాగాలేవీ లేకపోవడం, ఒకవేళ ప్రయోగమేదైనా విఫలమైనా రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోయేందుకు వీలుండడం లాంటి కారణాలు కూడా కలిసి రావడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవ చ్చు. 1969 లో శ్రీహరికోట రాకెట్ కేంద్రంగా ఎంపిక యింది. ఇక్కడ నుంచి 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ - 1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని ప్రయోగిం చింది. కానీ ఈ ప్రయోగం సఫలం కాలేదు. షార్ నుంచి ఇస్రో జరిపిన 99 ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యా యి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433 విదేశీ ఉప గ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18 స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008 లో చంద్రయాన్1, 2014లో మంగళ్‌యాన్, 2016లో పునర్వి నియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచ రికార్డు, 2017లో జిఎస్ఎల్వి మార్క్ 3 ప్రయోగం, 2023లో చంద్రయాన్- 3 విజయవంతం అయ్యాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను కూడా విజయవంతమైంది.

ఎన్విఎస్ - 02:

నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్విఎస్) అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది మనదేశంలోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతాని కి ఖచ్చితమైన స్థానం, వేగం, సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించబడింది. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్పీఎస్), రెండు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). ఎస్పీఎస్ 20 మీటర్ల కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని, సేవా ప్రాంతంలో 40 నానో సెకెన్ కంటే మెరుగైన సమయ ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. రెండో తరం ఉపగ్రహాల్లో మొదటిదైన ఎన్విఎస్-01ను 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 ద్వారా ప్రయోగించారు. తొలిసారిగా ఎన్విఎస్-01లో స్వదేశీ అణు గడియారాన్ని ప్రయోగించారు. ఎన్విఎస్ సిరీస్లోని రెండో ఉపగ్రహం ఎన్విఎస్-02ను ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్తో కాన్ఫిగర్ చేయడంతో పాటు సీ-బ్యాండ్లోని పేలోడ్ను దాని మునుపటి ఎన్విఎస్-01 మాదిరిగానే రూపొందించారు. ఇది 2250 కిలోల లిఫ్ట్-ఆఫ్ ద్రవ్యరాశి, 3కిలోవాట్ల పవర్ హ్యాండ్లింగ్ సామ ర్థ్యంతో స్టాండర్డ్ - 2కె బస్ ప్లాట్ఫామ్‌పై కాన్ఫిగర్ చేయబ డింది. ఐఆర్ ఎన్ఎస్ఎస్ -1ఈ స్థానంలో 111.75 డిగ్రీల ఉష్ణోగ్రతను అమర్చనున్నారు. ఎన్విఎస్-02 ఖచ్చిత మైన సమయ అంచనా కోసం స్వదేశీ, సేకరించిన పరమా ణు గడియారాల కలయికను ఉపయోగిస్తుంది. ఎన్విఎస్-02 ఉపగ్రహాన్ని ఇతర ఉపగ్రహ ఆధారిత వర్క్ సెంటర్ల సహకా రంతో యుఆర్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి) లో రూపొందించి అభివృద్ధి చేసి, ఇంటిగ్రేట్ చేశారు. ఉపగ్రహం వివిధ దశల్లో దాని పనితీరు సమ్మతి యొక్క సమగ్ర ప్రీ-షిప్‌మెంట్ సమీక్ష డిసెంబర్ 27, 2024న పూర్తయింది. ఈ ఉపగ్రహాన్ని 2025 జనవరి 05న భారత ప్రయోగ కేంద్రం ఎస్డీఎస్సీ-షార్కు పంపారు. ఇది విజయవంతం అయింది. జై భారత్ ! జై భారత్ !

జనక మోహన రావు దుంగ
యం.యస్సీ (ఫిజిక్స్)
8247045230

పద్మాలపై పదనిసలు

76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన పద్మ అవార్డుల విషయంలో తెలంగాణలో చర్చ జరుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమకిష్టమైన పార్టీని తద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. జీవవైవిధ్యం లాగా భిన్నత్వంలో ఏకత్వం అన్నదే రాజ్యాంగానికి పునాది. ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి. అలాగే అధికారంలోకి వచ్చే పార్టీలు, ప్రభుత్వాలు తారుమారవుతాయి. కానీ మౌలికమైన ప్రజాస్వామ్య భావనలు, విలువలు, పద్ధతులు వ్యవస్థలు అనేవి నిరంతరం కొనసాగుతాయి. అదొక ప్రక్రియ.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరి అయింది కాదు. పైగా అది అనేక అపార్థాలకు దారితీస్తుంది. బయటకు పేర్లు వ్యక్తం కావడం తద్వారా ఆయా వ్యక్తులు కూడా దీనివల్ల అనవసరమైన మనస్థాపా నికి గురయ్యే అవకాశం ఉంది. పార్టీల ఎన్నికల ప్రచార సభలలో లాగా బాధ్యతాయుతమైన పదవులలో ఉన్నవారు తాము దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామన్న స్పృహ కలిగి ఉండాలి. ఢిల్లీకి పోయి న గల్లీ బుద్ధులు మారకపోతే అది వాళ్ళ రాజకీయ భవిష్యత్తుకే గొడ్డలి పెట్టు అవుతుంది. ప్రచార సభల్లో ఎదుటివారిపై అవాకులు చవాకులు పేలి చప్పట్లు కొట్టించుకోవడం రాజకీయ నాయకులకు సహజమైనదేమో కానీ ప్రతిష్టాకరమైన పద్మ పురస్కారాల విషయంలో అనుచితమైన వ్యాఖ్యలు చేయడం బాగా అనిపించదు. పురస్కారాలు అనేవి పార్టీ పరంగా కాక అవి ప్రభుత్వపరంగా ఇచ్చే జాతీయ స్థాయివి అని గుర్తుంచుకోవాలి.

విద్య, వైద్యం, కళ,సాహిత్యం, చరిత్ర ,పర్యావరణం, క్రీడలు, సామాజిక సేవా రంగాలలో అపూర్వమైన ఆదర్శమైన సేవల్ని అందించిన వారిని గుర్తించడం ప్రజా ప్రభుత్వాల బాధ్యత. కాళి దాసు అన్నట్లుగా నరత్నం అన్విష్యతి మృగ్యతేహి తత్ అన్నట్లుగా రత్నం అనేది తనంతట తాను వెదకదు, అది వెదకబడుతుంది అని అర్థం. అలా ఆయా రంగాలలో విశేష కృషి సల్పిన వారిని గుర్తించ టం మన బాధ్యత. మన రాష్ట్రానికి సంబంధించి 2004లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి ఏ,బి,సి,డి వర్గీకరణకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా చేకూరేలా అకుంఠిత పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ, అలాగే వైద్యరంగంలో విశేష కృషి చేసిన నాగేశ్వర్ రెడ్డి గారికి పద్మ విభూషణ్ పురస్కారాలకు ఎంపిక చేయడం అభినందనీయం. కానీ గత 50 ఏళ్లుగా పీడిత గళానికి మైకును అమర్చి ప్రజా యుద్ధ నౌకగా పేరొందిన గద్దర్ను ఉపేక్షించడం భావ్యం కాదు. గద్దర్ స్ఫూర్తిగా వేలాది మంది కళాకారులు రూపొందారు. పీడిత ప్రజల సమస్యలు ఎన్నో ఆయన పాటల్లో చోటుచేసుకున్నాయి. ఆయన పాటలు వింటే కండ్ల పొంటి నీళ్లు పెయిపొంటి ముళ్ళు వచ్చేవి. అలాగే గత యాభై ఏళ్లుగా తెలుగు రాష్ట్రాలలో తనదైన శిక్షణ ద్వారా వేలాదిమంది విద్యార్థులను ఐఐటీలలో ఎంపిక అయ్యేలా కృషిచేసిన ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను పద్మభూషణకు పరిగణించకపోవడం దురదృష్టకరం. చుక్కా రామయ్య గారు స్వాతంత్ర్య సమరయోధులు. రెండేళ్ల పాటు జైలు జీవితాన్ని అనుభవించిన దేశభక్తులు. విద్యా ప్రపంతిని అన్ని వర్గాలకు మళ్లించాలని తపించిన వ్యక్తి.తన వ్యాసాల ద్వారా ఉపన్యాసాల ద్వారా సమాజాన్ని చైతన్యం కలిగించిన సామాజిక విశ్లేషకులు. విద్య కార్పొరేటీకరణను వ్యతిరేకించినవాడు. ఆయన దగ్గర శిక్షణ పొందిన వేలాదిమంది విద్యార్థులు ఈనాడు వివిధ దేశాలలో పని చేస్తూ దేశానికి సంపదగా మారారు. అలాగే ప్రజావాగ్గేయ కారులుగా పేరొందిన గోరేటి వెంకన్న,జయ జయహే తెలంగాణ గీతకర్త అందెశ్రీ, కనుమరుగవుతున్న సంచార జాతుల జీవన సాహిత్యాన్ని, ఆ కళాకారులను వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేసిన మౌలిక పరిశోధకులు జయదీర్ తిరుమల రావు గారలకు పద్మశ్రీకై పట్టించుకోకపోవడం దురదృష్టకరం.కేంద్ర ప్రభుత్వం గతంలో వన జీవి రామయ్యకు కిన్నెర మొగిలయ్యకు అనూహ్యంగా పద్మశ్రీలను ప్రకటించిన కేంద్రం ఈసారి తెలంగాణ పట్ల చిన్నచూపు చూడడం బాధాకరం. పద్మ అవార్డుల చరిత్రను గమనించినప్పుడు తమ సిద్ధాంతాలకు, విశ్వాసాలకు భిన్నంగా ఉన్న వ్యక్తులకు కూడా వారి వారి ప్రతిభను గుర్తించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ

డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

మళ్లీ జన్మించు మహాత్మా!

భారత జాతిపిత బాపూజీ!
మీ కలల సౌధం కుప్పకూలింది
ఆశయాల సుమం వశివాడింది
ఆకాంక్షల బాట బీటలుబారింది
అహింసా అస్త్రం తుప్పుపట్టింది
స్వేచ్ఛా భారతం బంధీ అయింది
దశాబ్దాలెన్ని గడిచిపోయినా
ప్రభుత్వాలెన్నీ మారిపోయినా
భారత స్థితిగతి మారలేదు
జాతి కన్నీటి ఎత తీరలేదు
నాటి సత్యాగ్రహాలు సహాయ నిరాకరణలు

ఆమరణ నిరాహార దీక్షలు
శాంతియుత సమరం చేసే
నిస్వార్థ నాయకులెవరు లేరు.
త్యాగదనుల ఎక్కడా కానరారు.
దేశం గూర్చి ఎవరికీ పట్టదు
మార్పు అన్నది అస్సలు గిట్టదు
ఎవరికి వారు యమునా తీరే
స్వార్థమే శ్వాసగా ...దోపిడే ధ్యేయంగా ...
మతోన్మాదమే వేదంగా..
అధికారమే పరమార్థంగా ...
నిరంకుశ పాలన సాగుతోంది

ఓ మహాత్మా... !
మీరు మళ్లీ పుట్టుకు రావాలి
మరో సంగ్రామం సాగించాలి
నల్ల పాలకుల తరిమి కొట్టాలి
స్వేచ్ఛ భారతం ప్రతిష్టించాలి

కోడిగూటి తిరుపతి
9573929493

గాంధీ ఆశయాలకై శ్రమిద్దాం

శాంతి, అహింసతో స్వాతంత్రోద్యమం
సాగించిన మోహన్ దాస్ కరంచంద్
గాంధీ
బ్రిటిష్ పాలన విముక్తికై
దేశ ప్రజలను సంఘటితం
చేసి అమరుల త్యాగ ఫలితంగా
స్వాతంత్ర్యము

దేశ ప్రజల నినాదం ఒక్కటే
మనమంతా
భారతీయులమని భావిస్తూ
గాంధీ మార్గంలో
అభివృద్ధికై అడుగులు
ముందుకు వేస్తూ
భిన్నత్వంలో - ఏకత్వంగా దేశ
ఐక్యత
ప్రపంచంలో మన ఖ్యాతి ప్రవీడ
విల్లుతుంది.

గాంధీ కలలు కన్న గ్రామ
స్వరాజ్యానికై
పౌరులందరూ జాగృతమై కదలాలి
సుసంపన్నమైన దేశంగా
భారతావని గగన
తలంలో నిలుపుదాం
గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం...

మిద్దె సురేష్
కవి, వ్యాసకర్త, 9701209355

పైసలు లెక్కపెట్టే కడుపులకి...

నువ్వు ఓడిపోవడం ఏంటి
నీ వాళ్ల గుణాన్ని పరీక్షించడానికి
దేవుడు నిన్ను "ఆయుధంగ"
ఎంచుకున్నాడు...
నీకెన్ని దెబ్బలు తాకిన
జీవితంతో యుద్ధం చేస్తున్నావ్
చూడు నీకంటే గొప్ప "సైనికుడు"
ఎవరుంటారు...
నువ్వెన్ని అవమానాలు
పడ్డ కాలంతో పాటు
చిగురిస్తు అడుగులు వేస్తున్నావ్
చూడు నీ గుణం కంటే
మెరిసే బంగారం వెతికినా దొరకదు....
పేదరికం నిన్ను
ఎన్ని గుంతల్లో పడేసిన లేచి
గట్టిగా నిలబడే నీ గుండె కంటే
బలమైన వజ్రం ఎక్కడుంటది....
ఐనోళ్ళు వాడుకొని వదిలేసిన
బంధాల్ని కళ్ళకద్దుకుంటున్నావ్
చూడు నువ్వే కదా కనిపించే దేవతవు
అన్నం తింటూ పైసలు
లెక్కపెట్టే కడుపులకి..
నిండు కుండలా ఉన్న
నీ కన్నీళ్లు కనిపించవు
వెళ్ళే దారిలో ముండ్లున్న...
ఆపని నీ బతుకు పోరాటం
ముందు ఎంతటి వారైనా
ఇసుకరేణువుతో సమానమే
బతకడం అంటే నాలుగు
బంగళాలు కొనడం కాదు..
వేల కోట్ల ఆస్తులు దాచిపెట్టడం కాదు
నీ జీవితం... ఓడిపోతున్న
ఇంకో జీవికి ఆదర్శం కావాలి
చివరి నిమిషం వరకు నువ్వొక
వెలిగే దీపంల కనిపించాలి...
నీ చేయి ఇంకొకరికి బలం కావాలి..
అప్పుడు నిన్ను కొన్ని తరాలు
గుర్తుపెట్టుకుంటారు....

తుమ్మల కల్పన రెడ్డి
9640462142

(జనవరి 30 న గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ)

పత్రికార్ ప్రతిపక్ష రాహుల్ గాంధీ!



ఆయన ఎవరికీ భయపడడు. తమ కార్యకర్తలకు భయపడవద్దు అని చెబుతాడు. ఆయనకు ఆడంబరాలు లేవు.. ఉండవు. ఆయన లో కల్పితాలు అస్సలు లేవు..కనిపించవు. చేతిలో డాక్టర్ బాబా సాహెబ్ రచించిన రాజ్యాంగం ఉంటుంది. గత పదిన్నర ఏండ్ల బీజేపీ పాలన వైఫల్యాలు దేశం ఆర్థిక, సామాజిక పరిస్థితి, పెరిగిన నిరుద్యోగం, ఆకలి, వైద్యం, విద్య సామాన్యునికి అందుబాటులో లేని నిత్యవసరాల ధరలు, మధ్యతరగతి కునారిల్లిన పరిస్థితి, రైతుల కు ఎమ్మెస్పి లేక 45 శాతం ఇదే రంగం పైన ఆధార పడిన వారి పరిస్థితి వివరిస్తూ వెళుతుంటాడు, ఆయన పార్లమెంట్‌లో, అటు బయట ఆయన ఇదే పని చేస్తున్నాడు. ఆయనే రాహుల్ గాంధీ. కాంగ్రెస్ నేత, పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి ఇటీవల చాలా కాలంగా ఒక నికార్సు అయిన జర్నలిస్ట్ పాత్రను పోషిస్తున్నారు. సహజంగా పాత్రికేయులు జనంలో కి వెళ్లి వారి సమస్యలను రిపోర్ట్ చేస్తూ ఉంటారు. ఇటీవల పెద్ద పెద్ద ఛానల్స్, పత్రికలు జనం వైపు స్టోరీ లు చేయడమే మానేశారు.
ప్రజల హితం అనేది లేకుండా పోయింది.
ప్రోటోకాల్‌ల వ్యవహారం తప్ప వేరే ఆలోచనే లేదు.
ఇక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, సీఎంలు, పీఎం ఇలా ఎవరూ, ఎక్కడికి వెళ్లాలన్న ప్రోటోకాల్స్, బందోబస్తూ, మొత్తం హంగామా సీన్‌లు మనకు దర్శనం ఇస్తూ ఉంటాయి. కొందరు అయితే యూనిఫారం మాదిరి డ్రెస్ కూడా వేసుకుని, తిరిగే ఆ కొంతసేపు నా నా హంగామా చేస్తూ, రాజు వెడలే, అటు చూడు అనే పరిస్థితి ఉంటుంది. ఎక్కడ కూడ సాధారణం కనిపించదు. అంతా ఆర్టిఫిషలే కనిపి స్తూ ఉంటుంది. కానీ రాహుల్ గాంధీ లో మనకు ఎక్కడ నాటకీయత కనిపించదు. అదే టీ షర్ట్, అదే మాములు, లేదా జీన్స్ ప్యాంటు, చలే పార్లమెంట్, యా చలే పబ్లిక్ మే అనే పరిస్థితి చూస్తున్నాం. కొంత అలా మన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడ డ్రెస్సింగ్ లో అలాగే సామాన్యంగా కనిపిస్తారు.

భారత్ జోడో నుంచి మారిన రాహుల్

దాదాపు ఆయన భారత్ జోడో యాత్ర నుంచి ఇదే ఒరవడి, కనిపిస్తుంది. పీడితులు, బాధితుల దగ్గరికి వెళ్లినా ఇదే పరిస్థితి. కండ్లల్లో ప్రేమ, ఆయన ధీరత్వం,భయం అనేది కనిపించని పరిస్థితి. రైతు దగ్గరికి పోలలోకి వెళ్లినా, రైతులను తన ఇంటికి పిలిచినా, కార్మికులను, బొగ్గు గని కార్మికులను, లారీ డ్రైవర్లను, క్లీనర్లను,బస్సుల్లో ప్రయాణికులను, కళాశాలల్లో విద్యార్థులను కలిసినా, రోడ్డు పక్కన చెప్పులు కుట్టే మోచి తో కలిసి కూర్చున్నా, తాపీ కార్మికులను, వలస కార్మికులను కలిసినా, గిగ్ వర్కర్స్ తో కలిసి మోటర్ సైకిల్ మీద ప్రయాణం చేసినా, వారితో కలిసి భోజనం చేసినా, వారి కష్టం గురించి అడిగి తెలుకుని, ఒక్కోసారి నోట్ చేసు కుంటూ రాహుల్ మనకు ఒక విపక్ష జర్నలిస్ట్ గా కనిపిస్తున్నా రు. ఇలాంటి పనులన్నీ గతంలో పాత్రికేయులు చేసే వారు, అన్నీ వారే అయి బాధితుల, పీడితుల వైపు నిలుచుండే వారు, ఒక అద్భుతమైన సంతృప్తిని పొందేవారు. ఇటీవల ఢిల్లీ ఎన్నికల ప్రచారం లోను రాహుల్ ఓటు అడుగుడు తక్కువ, ప్రజల సమస్యలు తెలుసుకోవడం ఎక్కువ చేస్తున్నారు.

ఢిల్లీ వీధుల్లోకి...

వీధులు తిరుగుతున్నారు.రాహుల్ విపక్ష నేతనా, లేక విపక్ష పాత్రికేయుడా అనే పరిస్థితి ఉన్నది. రాజ్యాంగంకు ఏమాత్రం దక్కా తగులకుండా, ఆ గౌరవంను నిలబెట్టడానికి అమలు చేయడానికి, చేతిలో రాజ్యాంగం పుస్తకం ను పట్టుకును, చూయిస్తూ ఉంటారు రాహుల్ గాంధీ. ఆయన ఒక అంబేద్కర్ వాదిలా కనిపిస్తున్నారు. రాహుల్ గాంధీని ట్రోల్ చేయడం, అవమానకరం గా మాట్లాడడం, కేసులు పెట్టడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అయినా రాహుల్ గాంధీ ఎలాంటి జంకు, బొంకు లేకుండా ముందుకు వెళుతూనే ఉన్నారు.రాహుల్ చేస్తున్నాడు, తిరుగుతున్నాడు ఏం చేస్తున్నాడు? ఒక్క సారి మనల్ని మనం దురుస్తు చేసుకోడానికి కొంత ఫాలో చేస్తే బాగుండేది ఏమో... అనిపిస్తుంది.
(ఎవరికీ వర్తిస్తే వారికే)

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

యుద్ధనౌక గద్దర్‌పై ప్రేలాపనలేలా?

కొందరు కొన్ని పదవుల్లోకి రాగానే, నడిమంతరపుసిరి అంటారు చూడండి అట్ల అన్నమాట. వారి మాటలకు పట్టపగ్గాలు ఉండవు. వారి కామెంట్స్ మరీ ఎబ్బెట్టుగా ఉంటాయి. తమని తాము ఏదో ఊహించుకుంటూ ఇతరులను చులకనగా మాట్లాడుతుంటారు. ప్రముఖ కవి, గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్న మీద కొందరు ఆయనకు ఎందుకు పద్మశ్రీ, పద్మవిభూషణ్ అంటూ, ఆయన ఒక మర్డరర్ అంటూ అవివేకపు కామెంట్స్ చేస్తున్నారు.ఆయనకు పద్మ ఇవ్వమని, అదేదో వారి జాగిరి అయినట్లు మాట్లాడుతున్నారు. మరీ దారుణంగా నోరు జారారు.గద్దర్ బతికినంత కాలం జనం కోసం బతికాడు. ఆయన ఎన్నడూ విక్టిం కార్డు పట్టుకుని తిరగలేదు! అవార్డులు, రివార్డులు, పదవుల కోసం వేంపర్లాడలేదు. ఆయన ప్రజల మనిషి, తన చివరి ఊపిరి దాకా ఈ దేశం పీడిత, తాడితుల వైపు నిలుచుండి పోరాడిన వ్యక్తి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆయన పేరు పద్మ అవార్డు లకు రికమండ్ చేసారు. గద్దర్ పేరిట సినీ అవార్డుల ప్రకటన చేశారు. కేంద్రం సీఎం రికమాండేషన్స్ ను పట్టించుకోలేదు. సీఎం అసంతృప్తి వ్యక్తం చేసారు. ఇష్యూ అయిపోయింది.దానికి ఒక కేంద్ర మంత్రి కామెంట్ చేయడం, ఒక బీజేపీ నేత బలపరిచిన విధానం ఏమి బాగోలేదు. ఇది మంచి పద్ధతి కాదు. ఒక త్యాగధనుడి జీవితంను కావాలని బద్నామ్ చేసినట్లు అవుతుంది.

31న గద్దర్ జన్మదినం!

ఈ నెల 31 న గద్దరన్న జన్మదినం ఉన్నది. ఈ సందర్భంగా ఆయన కోసం నెగెటివ్ ఆర్గుమెంట్స్ తగవు. 74 సంవత్సరాల వయసులో ఊపిరి విడిచిన గద్దరన్నకు తెలంగాణ, దాని గుండె కాయ సింగరేణి ప్రాంతంలోని నల్ల నేలంటే ప్రాణం నల్ల నేలలో గోలేటి నుంచి మందమర్రి, బెల్లంపల్లి, గోదావరిఖని, భూపాలపల్లి, కొత్తగూడెం, మనుగూరు వరకు రెండు దశాబ్దాల క్రితమే గద్దరన్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సింగరేణీని కాపాడుకునేలక్ష్యంతోసుధీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంతో పాటు సింగరేణి ప్రాంతంలో కార్మికులను, విప్లవకారులను, రాత్రికిరాత్రి ఇంటి నుంచి పట్టుకెళ్లి పోలీసులు నకిలీ ఎన్ కౌంటర్ల కింద కాల్చి చంపిన సందర్భంలో స్వయంగా రంగంలో దిగి నకిలీ ఎన్ కౌంటర్లను ఆయన వ్యతిరేకించారు.

ఓపెన్ కాస్ట్ వ్యతిరేక ఆందోళనల్లో గద్దర్!

ఓపెన్ కాస్ట్ బొగ్గు బావులను వ్యతిరేకిస్తూ అందోళనలు జరిగినప్పడల్లా నల్లనేలకు చేరుకుని ఆందోళనల్లో పాల్గొన్నారు. ఓపెన్ కాస్ట్ బొగ్గుబావుల్లో తెలంగాణ ప్రాంతం గ్రామాలు, వ్యవసాయ భూములు బొందల గడ్డలుగా మారుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు, పౌరహక్కుల నేతలు, కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్న నేపథ్యయంలో అక్కడికి వచ్చి కార్మిక వర్గానికి మద్దతు పలికారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు. తలపెట్టిన సింగరేణి వ్యాప్త ర్యాలీలు, సభల్లో తెలంగాణకు మద్దతునిచ్చిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పాలుపంచుకున్నారు. నల్లనేలలోనిబొగ్గుగని కార్మికుల, కళాకారుల ఇండ్లలో గద్దర్ తో దిగిన ఫోటోలు ఇప్పటికి దర్శనం ఇస్తాయి. ఇక్కడి కళాకారులకు ఆయన ఒక స్ఫూర్తిదాతగా, ప్రాణంగా భావిస్తారు అ

బీజేపీ-బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే..

- డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్
- నల్లగొండలో కేటీఆర్ రైతు ధర్నా ఒక డ్రామా
- రైతు ధర్నా కాదు బిఆర్ఎస్ నాయకుల ధర్నా
- పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి

నల్గొండ టౌన్, జనవరి 29 (జనంసాక్షి) : నల్లగొండ రైతుధర్నా లో కేటీఆర్ వన్నీ కాలయాపన మాయ మాటలని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు.బుధవారం నల్లగొండ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాప్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ ల తో ఉమ్మడిగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించారని ధ్వజమెత్తారు.కెసిఆర్ గడీల పాలన సాగించాడని అన్నారు.ఏ ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇవ్వకుండా మోసం చేసిండని ఆరోపించారు.ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని తండ్రి,కొడుకులు దోచుకున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత అసహనానికి గురై మాట్లాడుతున్నారని అన్నారు.గతంలో ప్రజలు,రైతుల సమస్యల కోసం ధర్నాలు చేస్తే ధర్నా చౌకాను ఎత్తివేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. 10 సంవత్సరాల కాలంలో అన్ని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని,దోచుకున్నారని విమర్శించారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కేటీఆర్ నల్లగొండకు వచ్చి ప్రగల్భాలు పలుకుతున్నాడనిఎద్దేవా చేశారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య కోసం పోరాటం చేశాడని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేశాడని గుర్తు చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో కేటీఆర్ది రైతు ధర్నా కాదు బిఆర్ఎస్ నాయకుల ధర్నా ఒక డ్రామా అని అభివర్ణించారు. నల్లగొండ గడ్డ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డా అని స్పష్టం చేశారు. నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నల్లగొండను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన కేసీఆర్ రెండు బీటీ రోడ్లను మాత్రమే ఏర్పాటు చేశారని, అభివృద్ధి, దత్తత అంటే ఇదేనా.. ఇక్కడి ప్రజలను నిలువునా మోసం చేశాడని విమర్శించారు. నల్లగొండలో రైతు మహా ధర్నా పేరుతో కొత్త డ్రామాకు తెర తీశారని ఆరోపించారు.నల్లగొండలో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు శిలాఫతకాలకే పరిమితమయ్యాయి తప్ప అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దొరల పాలన సాగించిన కెసిఆర్,కేటీఆర్ మాటలను ప్రజలు ఇప్పుడు ఎవరు నమ్మడం లేదని అన్నారు,మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైవే రోడ్ల విస్తరణతో పాటు నల్గొండ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరిలక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి శ్రీనివాస్, ఇబ్రహీం, జూలకంటి సైదిరెడ్డి, పిల్లి రమేష్ యాదవ్, కత్తుల కోటి, వజ్జ రమేష్ యాదవ్, కిన్నెర అంజి, గురిజ వెంకన్న, జానీ యాదవ్, కంచర్లకుంట్ల వెంకటరెడ్డి, గాలి నాగరాజు,కంచర్ల ఆనంద్ రెడ్డి, పెరిక హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల నడిగడ్డ, జనవరి 29 (జనవరిసాక్షి) : ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సంతోష్ బుధవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖిలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం..

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

పెబ్బేరు, జనవరి 29 (జనం సాక్షి) : అధైర్య పడొద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి భరోసా ఇచ్చారు. పెబ్బేరు మండలంలోని సుగూర్ గ్రామం లో పార్టీ కి సంబంధించిన బిఆర్ఎస్ కార్యకర్తలు బోయ బీసన్న, జూదం రాజులు అనారోగ్యంతో, రైతు అప్పుల బాధతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి,ఆర్థిక సహాయం చేశారు. పట్టణంకి చెందిన బుచ్చయ్య శెట్టి , ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని వెళ్లి పలకరించాడు. కార్యక్రమం లో మండల అధ్యక్షులు వనం రాములు వైస్ చైర్మన్ కర్రె స్వామి నాయకులు పెద్దింటి వెంకటేష్ జగన్నాథం నాయుడు సాయి ఎల్లారెడ్డి సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్ మధు జూదం వెంకటేష్ గోవిందు నాయుడు కొండల్ పర్శరాం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) : వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం మెదక్ పట్టణంలో మహిళా స్త్రీ శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో టీఎన్జీవోస్ భవనంలో ఏర్పాటుచేసిన దివ్యాంగుల కొరకు ఉచిత బ్యాటరీ ట్రైసైకిల్ ఎంపిక మరియు కృత్రిమ అవయవాల కొలతల శిబిరము జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు . ముందుగా వైద్య శిబిరాన్ని సందర్శించి దివ్యాంగుల వైకల్యానికి అనుగుణంగా వివిధ పరికరాల పంపిణీకి ముందుకు వచ్చిన అలీమ్ కో స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. దివ్యాంగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చే విధంగా చర్య తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలిమ్ కో స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల వైకల్యాలు బట్టి వారికి వివిధ పరికరాలు అందించడం కొరకు ముందుకు రావడం జరిగింది అన్నారు. దివ్యాంగుల వైకల్యాలను ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వారికి అనుకూలంగా పరికరాలు అందించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరిగిందని వివరించారు వినికిడి లోపం, ఆర్టిఫిషియల్ లింబ్స్, వీల్ చైర్స్ బ్యాటరీ సైకిల్స్ ఈ పరికరాల పంపిణీకి ప్రతిపాదన సిద్ధం చేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దివ్యాంగుల వైకల్యాల పరికరాలను శిబిరాలు జిల్లాలో రేపు రామాయణపేటలో ఎల్లుండి నర్సాపూర్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు మానసిక లోపం కలిగిన దివ్యాంగులను గుర్తించి దానికి అనుగుణంగా చికిత్స అందిస్తామన్నారు. అవసరమైన దివ్యాంగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ డాక్టర్ను ఏర్పాటు చేసుకొని ఫిజియోథెరపీ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేయడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని వీటన్నిటికీ విశేష స్పందనతో ముందుకు పోతూ దానికి అనుగుణంగానే ఈరోజు దివ్యాంగుల కొరకు ఉచిత బ్యాటరీ ట్రైసైకిల్ ఎంపిక మరియు కృత్రిమ అవయవాల కొలతల శిబిరము ఏర్పాటు చేసినట్లు చెప్పారు ఈ శిబిరంలో 110 దరఖాస్తులు సమర్పించారన్నారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో నిష్ణాతులుగా రాణించాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల పరికరాల కృత్రిమ అవయవాల కొలతల శిబిరాలను ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డీడబ్ల్యూ హైమావతి, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, ఆర్టిఫిషియల్ లింబ్ మన్ ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రసన్నకుమార్, రాజబాబు, సురేంద్ర, గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ సురేందర్, ఇతర ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ప ఉద్యోగులకు అందని గౌరవ వేతనాలు

న్యాల్‌కల్, జనవరి 29 (జనంసాక్షి) : రెండు నెలలుగా గౌరవ వేతనాలు అందక నిత్యం అవస్థలు పడాల్సివస్తుందని, ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దృష్టి సారించి గౌరవ వేతనాలను అందజేయాలని మండలంలోని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో అభియాన్ ఉద్యోగులు ఓ ప్రకటన విడుదల చేశారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలో 117గురు చిరు ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం రెండు నెలలు గడుస్తున్న సమయానికి జీతాలు అందడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర జీతాలతో అతి కష్టం మీద కుటుంబాలను నెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దృష్టి సాధించి రెండు నెలల వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, సంగమేశ్వర్, మోహన్, రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు ప్రారంభించిన చిన్నారెడ్డి

పెబ్బేరు, జనవరి 29 (జనంసాక్షి) : పట్టణ కేంద్రంలో శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అంతరాష్ట్ర అఖిలభారత ఒంగోలు జాతి పశు బల ప్రదర్శన నిర్వహించారు బండలాగుడు పోటీలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బండలగుడు పోటీలను వీక్షించడానికి విచేసిన ప్రతి రైతులకు చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. చౌడేశ్వరి దేవి చాలా బాగా ప్రతి ఏడాది బండలాగుడు పోటీలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. పెబ్బేరు పట్టణ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తారతమ్యం భేదం లేకుండా అందరిలో కలిసిపోవాలని అను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ మున్సిపల్ చైర్మన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్దుల కరణశ్రీ సాయినాథ్, వైస్ చైర్మన్ కర్రే స్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు కార్పాకుల వెంకట రాములు యాదవ్, నాయకులు కృపాకర్ రెడ్డి, మన్యం, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూమిని ఆన్‌లైన్‌లో ఫ్రీజ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, జనంసాక్షి 29 (జనంసాక్షి) : రైతు భరోసా సర్వే సందర్భంగా వనపర్తి జిల్లాలో గుర్తించిన వ్యవసాయేతర భూమిని ఆన్లైన్ లో నిక్షిప్తం చేసి ఫ్రీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో వెబ్ కాందరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జామచేసే ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన ప్రతి రైతుకూ రైతు భరోసా అందేవిధంగా చూడాలన్నారు. రైతు భూమిలోని కొంత భాగం వ్యవసాయం చేస్తూ మరికొంత భాగం వ్యవసాయేతర భూమిగా మార్చిన వాటిని విడదీసి వ్యవసాయ యోగ్యం ఉన్న భూమికి రైతు భరోసా పడాల్సి ఉంటుందన్నారు. దీనికొరకు ఎంత భూమి వ్యవసాయేతర భూమి ఉందో దానిని మాత్రమే ఆన్లైన్ లో ఫ్రీజ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు కూర్చొని సమన్వయంతో ఫ్రీజింగ్ ప్రక్రియ సాయంత్రంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రేషన్ కార్డుల విషయంలో ఏదైతే కొత్త దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చాయో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి రేషన్ కార్డుకు అర్హులైన జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, తహసిల్దార్ మదన్ మోహన్, అందరూ తహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు

- నాగర్ కర్నూల్ లో అనిమల్ బర్త్ కేర్ సెంటర్ ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్ రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) : నాగర్‌కర్నూల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి నిధుల ద్వారా 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అనిమల్ బర్త్ కేర్ సెంటర్ ను నాగర్ కర్నూల్ స్థానిక శాసనసభ్యులు కూచకుళ్ళ రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్లో వైద్య సేవలలో భాగంగా వీధి కుక్కలను పట్టుకుని జనన నియంత్రణ ఆపరేషన్లు, రేబిస్, పార్వోవైరస్, డిస్టెంపర్ వంటి వ్యాధుల నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు అందించనున్నట్లు, స్టెరిలైజేషన్ (నసబంధి) ఆపరేషన్ చేసి తిరిగి వాటిని వాటి సహజ జీవావరణంలో వదిలే విధానాన్ని అమలు చేస్తారని కలెక్టర్ తెలిపారు .ఇది వీధి కుక్కల పెరుగుదల నియంత్రణతో పాటు వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా ఉంటుందని స్టెరిలైజేషన్ ప్రక్రియ ద్వారా కుక్కల సంఖ్యను నియంత్రించి, వీటి వల్ల ప్రజలకు కలిగే సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఆపరేషన్ పూర్తయిన కుక్కలను పూర్తిగా ఆరోగ్యంగా మారిన తర్వాత తిరిగి వాటి ప్రాంతాలకు వదిలేస్తారని, ప్రజలకు వీధి కుక్కల ప్రవర్తన, సంరక్షణ, వీటి జనన నియంత్రణ అవసరాన్ని వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. నాగర్‌కర్నూల్ స్థానిక శాసనసభ్యులు కూచకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ... పట్టణ ప్రగతి నిధులను ఉపయోగించి వీధి కుక్కల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వీధి కుక్కల పెరుగుదల నియంత్రణతో పాటు శునకాల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల నుండి వీధి కుక్కలను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ నిర్వహించి, పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న తర్వాత వాటిని తిరిగి విడిచిపెడతారని తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభంతో వీధి కుక్కల నియంత్రణ, శునకాల ఆరోగ్య సంరక్షణ, సాధ్యమవుతుందని భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల సహకారంతో శునకాల సంరక్షణ, జనన నియంత్రణ కోసం మరిన్ని నిధులు కేటాయించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీధి కుక్కల సంఖ్య తగ్గించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని శాసనసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య శాఖ అధికారి జీవీ రమేష్, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యూనివర్సిటీలతో శిక్షణ పరిశోధనల ఒప్పందాలను ప్రోత్సహిస్తాం

నర్సాపూర్, జనవరి 29 (జనంసాక్షి) : జపాన్ దేశంలో సకురా సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొన్న బివిఆర్ఐటి విద్యార్థులను విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణుం రాజు అభినందించారు,బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 19 నుండి 25 వరకు జపాన్‌లోని కుమమోటో యూనివర్సిటీలో జరిగిన సకురా సైన్స్ ప్రోగ్రాంలో కుమమోటో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షుయిచీ టోరీ మార్గదర్శకత్వంలో ఏడుగురు విద్యార్థులు,ఒక అధ్యాపకుడు కలిగిన బృందం వ్యర్థాలను శక్తిగా మార్చిడి చేసే సాంకేతికతల పై పరిశోధన శిక్షణలో పాల్గొన్నారని ఆయన తెలిపారు, కుమమోటో సిటీలో ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి, ఘన వ్యర్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చిడి, వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తిగా మార్చిడి చేసే సౌకర్యాలను అధ్యయనం చేశారన్నారు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధకులతో పరిశోధన నావీన్యత మార్చిడి కార్యక్రమాలలో పాల్గొన్నదన్నారు,కుమమోటో యూనివర్సిటితో పరిశోధన సహకారాలను అందించేందుకు ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. విదేశాలతో ఒప్పందాలు శిక్షణ పరిశోధనలను ప్రోత్సహిస్తామని అన్నారు, వైస్-చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్,సెక్రటరీ శ్రీ ఆదిత్య విస్సం,రీసెర్చ్ డీన్ డాక్టర్ రాజు ఏర్లా, డైరెక్టర్ అన్ప్రొఫెసర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంజయ్ దూబే, డాక్టర్ రాధిక,డాక్టర్ వరుణ్ లు ఈ బృందాన్ని అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో అనునిత్యం అవస్థలు

- వేతనాలిచ్చి ఆదుకోండి ఈజీఎస్ సిబ్బంది ఆందోళన

న్యాల్‌కల్, జనవరి 29 (జనంసాక్షి) : ఇచ్చే అరకోర వేతనాలు సైతం సకాలంలో అందకపోవడంతో అనునిత్యం ఆర్థిక అవస్థలతో సతమతమవుతున్నామని, ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దృష్టి సాధించి మూడు నెలల బకాయి గౌరవ వేతనాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజిఎస్) అధికారుల సిబ్బంది బృందం డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ భవనం ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఎంపీడీఓ రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో.. ఏపీఓ రంగారావు, టీఏ లు వెంకట్రావు, ప్రవీణ్, రాములు, నర్సింహారెడ్డి. సీఓ లు మొగులయ్య, సమ్మయ్య. ఈజీఎస్ క్షేత్రస్థాయి ఎఫ్ఏ లు అబ్బాస్ అలీ, సుకుమార్, వైద్యనాథ్, జగన్నాథ్ రెడ్డి, విట్టల్, తదితరులు ఉన్నారు.

బడిలో గుడి వద్దు

గద్వాల నడిగడ్డ, జనవరి 29 (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కి గట్టు మండలం ముచోనిపల్లి గ్రామంలో ఎంపిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో గుడి నిర్మాణం వొద్దు అని బుధవారము అసిస్టెంట్ కలెక్టర్ నర్సింగరావు కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గుడి నిర్మాణం వొద్దు అని గతంలో కూడా ఎన్నోసార్లు ఎంఇఓ, డిఇఓకి ఫిర్యాదు చేసిన ఫలితం లేక పోయిందని అందుకే కలెక్టర్‌కి ఫిర్యాదు చేశాము అన్నారు. కాబట్టి వెంటనే పాఠశాల ఆవరణలో పిల్లలకు ఆట స్థలం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ స్థలం లేక పిల్లలకు ఆటలు కూడా చాలా ముఖ్యం కాబట్టి వెంటనే పాఠశాల ఆవరణలో గుడి నిర్మాణం వద్దు అని తమరితో విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. స్థానిక ఉపాధ్యాయులు కూడా పట్టించుకోకుండా ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్కడ నిర్మాణం చేయుట ఏంటి అని అన్నారు. అక్కడ గుడి నిర్మాణం వేరే స్థలంలో నిర్మించాలి అని అన్నారు. ముచ్చనిప్పల్లి గ్రామంలో ఈ సమస్య వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పీ టీం అధ్యక్షుడు బండారి సునంద, తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు కొమ్ముల ప్రవీణ్, ముచినిపల్లి గ్రామస్థులు భాస్కర్, దేవేంద్ర, సుమన్, ప్రభాస్, ఇజ్రాయేల్, మధు, అశోక్, పౌలు, గోవిందు, మరెన్న, యేసురాజు,రాజు తదితులున్నారు.

పులిగుండాల ప్రాజెక్టుకు సందర్శకులు పెంచేలా చర్యలు

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

కల్లూరు, జనవరి 29 (జనంసాక్షి) : పచ్చని అడవి, ఆహ్లాదకరమైన వాతావరణంలో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టు ను ఎకో టూరిజం ప్రాంతంగా ఫిబ్రవరి నుండి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టుతున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, సత్తుపల్లి డివిజన్ తల్లాడ పరిధిలోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్ పులిగుండల ప్రాజెక్ట్ ను ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్‌లతో కలిసి పరిశీలించారు. సుమారు 5 కిలోమీటర్లు అడవిమార్గం గుండా కాలినడకన గుట్ట పైకి ఎక్కి పులిగుండాలను కలెక్టర్ సందర్శించారు. ఎకో టూరిజం ప్రణాళికలో భాగంగా కలెక్టర్ కమాండర్ జీపులో ప్రయాణించి పచ్చని సోయగంతో ఉన్న అటవీని సంరక్షిస్తూ ఇక్కడ ఆహ్లాదకరమైన పరిస్థితులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ కోసం మొత్తం ఏరియాని పరిశీలించారు. పాలపిట్ట ఓరియల్ టవర్ ఎక్కి బైనాక్యులర్ ద్వారా చుట్టుపక్కల ఏరియల్ వ్యూ కలెక్టర్ చూశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువగా మనకు ప్రకృతి పరంగా అందమైన గుట్టలు, చెరువు, గుట్టల నుండి జాలూవారే నీళ్లతో అడవిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసుకోవాలని, దీనివల్ల ఆర్యోగమనే సంపద వస్తుందని అన్నారు. రానున్న తరాలకు పర్యాటక ప్రాంతంగా తీసుకొని వచ్చి ప్రకృతిని కాపాడుతూ, అభివృద్ధి చేస్తామని తెలిపారు.ప్రకృతిని కాపాడుకోలేక మనకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానిని నివారించేందుకు అభివృద్ధి చేపట్టామన్నారు. పులిగుండల ప్రాజెక్టులో ఆహ్లాదం పంచే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.పర్యాటకుల కోసం చెరువులో బోటింగ్, వసతి కాటేజ్‌లు, భోజనం, త్రాగునీరు వసతులను కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబం, పిల్లలతో సందర్శించి ఆనందంగా గడిపేలా కార్యక్రమం తయారు చేస్తామని అన్నారు. చెరువులో సంచరించే పక్షులు, పులిగుండల చరిత్ర చెప్పే విధంగా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు గైడ్‌లు కూడా అందుబాటులో ఉంటారని అన్నారు. పిల్లలకు సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటివి అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, అటవీ రేంజ్ అధికారి జి. నాగేశ్వరరావు, అటవీశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఆర్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క

మర్రిగూడ, జనవరి 29 (జనంసాక్షి) : పిఆర్ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అందించబోతున్న స్టడీ మెటీరియల్‌లో బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ భవన్‌లో పంచాయతీరాజ్ శాఖ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ అందించే మెటీరియల్‌తో పాటు పిఆర్ఆర్ ఫౌండేషన్ అందిస్తున్న లాస్ట్‌మినిట్ రివిజన్ బుక్‌గా ఎగ్జామ్ మెటీరియల్ అందించడం అభినందనీయమని ఆమె అన్నారు. ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి ఆలోచన చేయడం చాలా సంతోషకరమని భవిష్యత్తులో విద్యతోపాటు సామాజిక అంశాల పైన మరెన్నో కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులను చైతన్య చేయాలని సందర్భంగా ఆమె అన్నారు. విద్యార్థులు పిఆర్ఆర్ ఫౌండేషన్ అందిస్తున్న మెటీరియల్ సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి ఫలితాలు సాధించి ఎంత కష్టమైనా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించి మన జీవితాన్ని సరైన మార్గంలో నిలబెట్టుకునే అవకాశం ఉంటుందని దానికి పిఆర్ఆర్ ఫౌండేషన్ లాంటివారు విద్యార్థులకు చేయూతను అందించడం కూడా అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఆర్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ సోమ జ్యోతి, చేల్లం వెంకటేష్, యం. శివాని తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ హత్యకేసులో గురుమూర్తికి 14 రోజుల రిమాండ్

- **జడ్జి ఎదుట నాకు బెయిల్ వద్దు.. న్యాయవాదులు వద్దు అని చెప్పిన నిందితుడు**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట్ హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు గురుమూర్తికి బుదవారం రంగారెడ్డి జిల్లా కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది.మీర్ పేట్‌పోలీస్ స్టేషన్ నుంచి నిందితుడు గురుమూర్తిని వనస్థలిపురంలోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి రంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఇక కోర్టులో జడ్జి ఎదుట నాకు బెయిల్ వద్దు న్యాయవాదులు వద్దు అని చెప్పాడు గురుమూర్తి. దీంతో రంగారెడ్డి జిల్లా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఫిబ్రవరి 11 వరకు రిమాండ్ విధించింది. దీంతో మీర్‌పేట్ పోలీసులు నిందితుడు గురుమూర్తిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఇకపోతే ఈనెల 15న మీర్‌పేట్‌లోని తన నివాసంలో గురుమూర్తి తన భార్య వెంకట మాధవిని గోడకేసి కొట్టి.. గొంతుపిసికి చంపాడు. అనంతరం హత్య నుంచి తప్పించుకునేందుకు ఆమె శరీర భాగాలను ముక్కలుముక్కలుగా నరికేశాడు. వాటిని ఓ బకెట్‌లో హీటర్ పెట్టి ఉడకబెట్టాడు.అనంతరం వాటిని కాల్చి బూడిద చేశాడు. అనంతరం బూడిదను సమీపంలోని చెరువులో కలిపేశాడు. అయితే ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ఆధారాలను సేకరించారు. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురుమూర్తి తన భార్యను హత్య చేసినందుకు ఆధారాలు లభించడంతో దానిని మర్డర్ కేసుగా మార్చారు.

ఎస్సీ హాస్టల్లో ఇనుపరాడ్ మీదపడి విద్యార్థినికి తీవ్రగాయాలు

అచ్చంపేట జనవరి 29 (జనంసాక్షి) : పట్టణంలోని ఎస్సీ హాస్టల్లో ఇనుప రాడ్ఊడి విద్యార్థినితలపై పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అచ్చంపేటలోని ఎస్సీ హాస్టల్లో నందిని అనే విద్యార్థిని హాస్టల్ లో ఉంటూ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఈ క్రమంలో ఇవాళ ఉదయం హాస్టల్లో ముఖం కడుగుతుండగా భవనం పైనుంచి ఇనుపరాడ్ ఊడి తలపై పడింది. ఆమె తలకు తీవ్ర గాయం అవడంతో ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు తలకు 15కుట్లు వేశారు. అయితే కోతులు ఊపడం వల్ల రాడ్ ఊడి పడిందా లేకమరేదైనా కారణమా పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

గచ్చిబౌలిలో వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- **పోలీసుల అదుపులో 9 మంది...**

శేరిలింగంపల్లి, జనవరి 29 (జనంసాక్షి) : గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారాన్ని కొనసాగిస్తూ పైకి నిజాయితీ కలిగిన వ్యక్తుల్లా చలామణి అవుతున్న ఓ సెక్స్ రాకెట్ ముఠాను గచ్చిబౌలి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి ఇన్స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి పరిధి టీఎన్జీవోస్ కాలనీలో గత కొంతకాలంగా ఓ వ్యక్తి విదేశీ మహిళలను తన ప్లాట్ కు రప్పించి గుట్టుగా వ్యభిచారాన్ని నిర్వహింప చేస్తున్నాడు. అయితే తరచుగా కొత్త కొత్త మహిళలు పరిసర ప్రాంతాలలో తారసపడుతుండడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగువారు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటి విభాగం పోలీసులు, టాస్క్ ఫోర్స్ విభాగం పోలీసులు చాకచక్యంగా వలపన్ని బుధవారం ఆ ఇంటి పై దాడులను నిర్వహించారు. దీంతో సదరు ప్లాట్ లో కెన్యా, టాంజానియా, బ్యాంకాక్ దేశాలకు చెందిన 9 మంది యువతులు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రెస్క్యూ కేంద్రానికి తరలించి ప్రధాన నిందితుడికోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గచ్చిబౌలి సిఐ వివరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అకస్మిక తనిఖీ

నిడమనూరు (హాలియా), జనవరి 29 (జనంసాక్షి) : హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది అందరూ సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. అత్యవసర పనిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాలేకపోతే ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలతో పాటు, సాధారణ ప్రసవాలను పెంచాలని ఆమె ఆదేశించారు. అనంతరం హాలియ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి బాలికల విద్యాలయలో సౌకర్యాలను, కిచెన్ వంట సామాగ్రి సరుకులు,తదితర విషయాలను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ లో డైనింగ్ హాలు లేదని గమనించిన ఆమె విద్యార్థినిలకు ఇబ్బందులు కలగకుండా వారం రోజుల్లో డైనింగ్ హాల్ షెడ్ ఏర్పాటు చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- **దుండగులను కఠినంగా శిక్షించాలని నిరసన**

నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) : అమృత్‌సర్‌లో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పట్టపగలే నడిరోడ్డు మధ్య ధ్వంసం చేయడాన్ని నారాయణపేట హిందూ ఐక్య వేదిక ఖండిస్తూ బుధవారం నిరసన తెలిపారు.దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ రాంబాబు డిమాండ్ చేశారు,ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారతదేశం అని అలాంటి దేశ రాజ్యాంగాన్ని రచించిన శ్రీ అంబేద్కర్ విగ్రహాన్ని జాతి వ్యతిరేక శక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.అమృత్ సర్ లో జరిగిన సంఘటనను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ అంబేద్కర్ యువ జన సంఘం, బజరంగ్దళ్ విశ్వహిందూ పరిషత్, డాక్టర్లు,హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ చౌరస్తా దగ్గర శ్రీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి సెంటర్ చౌక్‌లో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి ప్రవీణ్ కదుదాస్, ఉపాధ్యక్షులు కన్న శివకుమార్గౌరవ అధ్యక్షులుకేతన్ రఘు, నగర సంఘ్ చాలక్ మదన్ మోహన్ రెడ్డి ,బజరంగ్దళ్ అధ్యక్షులు శ్రవణ్,నీరటి వెంకటేష్,డాక్టర్ ప్రసాద్ శెట్టి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ బాలరాజ్, సందీప్, సూర్యకాంత్, నరసింహ ఆకాష్ వీరేష్, నితీష్, జంగం శేఖర్, అనిల్ రెడ్డి, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

జిల్లాలోని నాలుగు ఎత్తిపోతల పథకాలకు భూసేకరణ

- **రాష్ట్ర భూసేకరణ ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) : జిల్లాలోని నాలుగు కొత్త ఎత్తిపోతల పథకాలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశ మందిరం నందు ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన నాలుగు ఎత్తిపోతల పథకాలైన బెట్ట తండా లిఫ్ట్ ఇరిగేషన్ పాలకీడు మండలం, రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం చింతలపాలెం మండలం, రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కోదాడ మండలం, ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అనంతగిరి మండలం చెందిన నాలుగు ఎత్తిపోతల పథకాలు జిల్లాకు మంజూరు అయ్యాయని తెలిపారు.వీటి ఏర్పాటు కొరకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి.రాంబాబు, ఇరిగేషన్ ఎస్సీ శివధర్మతేజ, ఈఈలు సత్యనారాయణ, రామకిషోర్, డీఐఓ ప్రేమ్ చంద్, భూ సేకరణ విభాగం సీనియర్ అసిస్టెంట్ ఆకాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయకసాగర్ మల్లన్న సాగర్ డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ పూర్తి చేయాలి

సిద్దిపేట బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ సంభందించిన డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియ గూర్చి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిజర్వాయర్ కెనాల్ గురించి పూర్తి వివరాలను కలెక్టర్‌కి వివరించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్ ఆక్యువేషన్) గీత, ఆర్డిఓ సదానందం, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాతలుగా నిలుస్తున్న మలక్‌పేట యశోద డాక్టర్లు..

దేవరకొండ, జనవరి 29 (జనంసాక్షి) : మనిషికి ఆయువు పోసేది భగవంతుడు అనేది ఒక నమ్మకం, ఆ నమ్మకానికి రూపమిచ్చిందే వైద్యుడు. అటువంటి వైద్యులే హైదరాబాద్ మలక్పేట్ యశోద హాసిటల్లో ఆకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధికి ఎండోస్కోపీ విధానంతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రముఖ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటీరాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్సవత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం దేవరకొండ పట్టణం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకలాసియా కార్డియా అనే ఓ అరుదైన వ్యాధి ప్రతి పది వేల మందిలో ఒకరికి వచ్చే అవకాశం ఉంటుందని, ఈ వ్యాధి సోకిన రోగి నోటి ద్వారా ఆహారాన్ని తీసుకోలేకపోవడం ఈ వ్యాధి లక్షణం అని అన్నారు. గతంలో ఈ వ్యాధికి శస్త్ర చికిత్స మాత్రమే పరిష్కారం ఉండేదని, కానీ యశోద మలక్పేట హాస్పిటల్లో అత్యంత అధునాతన వైద్య రీతిలో దీనికి మెరుగైన చికిత్సను అందించి 44 సంవత్సరాల వ్యక్తి ప్రాణాలు కాపాడమని తెలిపారు. శిరసనగండ్ల గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే వ్యక్తి గత పది సంవత్సరాల నుండి ఆహార పదార్థాలను మింగడానికి చాలా ఇబ్బంది పడుతుండేవాడని, గత ఆరు నెలలుగా అతను ద్రవపదార్థాలను కూడా తీసుకోలేకపోతున్నాడని తెలిసి అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో అతనికి మలక్పేట యశోద ఆసుపత్రి తీసుకొచ్చారు. పరీక్షలు జరిపిన తర్వాత అతనికి ఉన్న జబ్బు అకలాసీయ కార్డియా టైప్ వన్ అని నిర్ధారించామని తెలిపారు. కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఇంటిరాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్సవత్ ఎండోస్కోపీ చికిత్స ద్వారా అతని వ్యాధి నయం చేశామని తెలిపారు. ప్రస్తుతం అతను నోటి ద్వారా ఆహారం తీసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది పడటం లేదని తెలిపారు. యశోద మలక్పేట ఆసుపత్రిలో అత్యంత అధునాతన సౌకర్యాలు సాంకేతిక వైద్య పరిజ్ఞానం చికిత్స పద్ధతులతో కూడిన గ్యాస్ట్రో ఎన్టీరాలజీ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. అత్యంత క్లిష్టమైన వ్యాధులను కూడా యశోద వైద్య బృందం చక్కటి చికిత్సను పరిష్కారాలను అందజేస్తుందని వారు భరోసానిచ్చారు.

భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

వరంగల్ ఈస్ట్ , జనవరి 29 (జనం సాక్షి)

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని వికాస్ రాజ్, ఐఏఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆర్ అండ్ బి సందర్శించారు. ఆయన వెంట వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, ఆర్ అండ్ బి సి ఈ, ఎస్సీ తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజ అనంతరం ప్రముఖులకు అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి వల్లినాయగం , అసిస్టెంట్ స్థపతి గణేష్ దేవస్థానమునకు విచ్చేసి దేవస్థానము నాలుగు వైపులా నిర్మించనున్న రాజగోపురాల ప్లాన్లు ఎస్టిమేట్లు పరిశీలించి కొలతలు తీసుకోవడం జరిగింది.

చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు తనిఖీ

మహదేవపూర్, జనవరి 29 (జనంసాక్షి)

అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ బుధవారం నాడు మహాదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా డిస్ట్రిబ్యూటెడ్ కెనాల్ 1 జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం పనులు అతి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, అధికారులు రైతుల సమన్వయంతో త్వరితగతిన సర్వే పూర్తి చేసి చిన్న కాళేశ్వరం కాలువ పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామస్థుల సహకారంతో కాలువ పనులు వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ వెంట మహదేవపూర్ తాసిల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ . డిఐ రాములు మండల సర్వేయర్ రాజా రమేష్ పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమైన 1962 సిబ్బంది

నిలిచిపోనున్న పశు సంచార వాహన సేవలు

కొన్ని నెలలుగా వేతనాలు అందక సిబ్బంది

సిబ్బందిపై కరుణ చూపని ప్రజా ప్రభుత్వం

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

మూగజీవాల సేవలో ముందుంటారు కానీ వారు అందిస్తున్న సేవలపై ప్రభుత్వం మాత్రం శీతకన్ను చూపిస్తుందని 1962 సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 1962 పశు సంచార వాహన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో మూగజీవాల ప్రాణాలు నిలుపుతున్న సిబ్బందికి మాత్రం చాలి చాలని జీతాలతో అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియక అర్ధాకలి తో అలమటిస్తున్న మన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉద్యోగులు మరియు సిబ్బంది బుధవారం పత్రిక ప్రకటనలు మాట్లాడుతూ ప్రభుత్వం సిబ్బంది జీతాల నిధులను విడుదల చేయక పోవడంతో కుటుంబ పోషణ రోజు రోజుకు భారంగా మారుతుందని సిబ్బంది వాపోతున్నారు. ప్రజా ప్రభుత్వం లోనైనా తమ బతుకులు మారుతాయని ఆశలు పెట్టుకున్న సిబ్బందికి నిరాశే మిగిలింది. ఇక చేసేది ఏమీ లేక సిబ్బంది సమ్మె సైరన్ మోగించారు. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్న సుమారు 100 వాహనాల సేవలు నిలిచిపోను న్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజక వర్గానికీ ఓక వాహనం చొప్పున 100 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. 1962 పశు సంచార వాహన సేవల్లో పశు వైద్యులు పారామెడిక్, సహాయకులు, డ్రైవర్ లు సేవలు అందిస్తుండగా సిబ్బందికి గత కొన్ని నెలలుగా వేతనాలు లేక ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతు న్నారు. క్షేత్రస్థాయిలో మూగ జీవాలకు సేవలు అందిస్తున్న ప్రజల నుండి అభినందనలు తప్ప ప్రభుత్వం నుండి నిధులు అందక సిబ్బంది వేతనాలు మాత్రం అందడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.
ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిం చి1962 మూగజీవాల సేవల ను పటిష్టంగా
అమలుపరిచి క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసి సిబ్బందిని ఆదుకోవాలని కోరారు. గతంలోమెరుపు సమ్మె కు పిలుపునివ్వడం తో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ప్రజా ప్రభుత్వం మీద నమ్మకంతో సిబ్బంది కుటుంబ పోషణ భారం అవుతున్న సేవలు మాత్రం నిబద్ధతతో చేస్తున్నామని ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులను విడుదల చేయాలని లేదంటే ఫిబ్రవరి 01 నుండి సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు.

నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ డ్రైవ్.

గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల నడిగడ్డ, జనవరి 29 (జనంసాక్షి)

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు.
బుధవారం ఐ.డి.ఓ.సిలోని తమ ఛాంబర్ నందు ఎం.ఏ.ఎల్.డీ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ జాబ్ డ్రైవ్ గోడపత్రికను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సూచిస్తూ, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యూలాండ్ లాబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో జనవరి 30 వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఎంఏఎల్డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వర్చ్యువల్ క్లాస్ రూమ్ లో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఈ జాబ్ మేళాలో 18 నుండి 23 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఇంటర్మీడియట్ ఎం పి సి, బై పి సి, 2022, 2023, 2024 డిగ్రీ ఉత్తీర్ణత లేదా ఫెయిల్, 2021, 2022, 2023, 2024 బి ఎస్ సి కెమిస్ట్రీ పాసైన వారు, 2025 ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులు అని తెలిపారు. అభ్యర్థులకు తెలుగు భాషలో ప్రావీణ్యం,
ఇంగ్లీష్‌పై ప్రాథమిక అవగాహన అవసరమని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ. 2,00,000/- ఉంటుందని, అదనంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉన్నత విద్యకు ప్రత్యేక సహాయం, ఉచిత రవాణా సౌకర్యం, సబ్సిడీ క్యాంటీన్ భోజనం,రాత్రి షిఫ్ట్ అలవెన్స్ వంటి ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హతలు కలిగిన ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు,కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కాలందర్ భాషా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాధిక, కళాశాల టీఎస్‌కేసీ సమన్వయకర్త సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు, జనవరి 29 (జనంసాక్షి)

విద్యార్థులు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తో పాటు మాగనూర్ మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు పదవ తరగతి పాఠాలు సులభంగా అర్థమయ్యేలా 2డి, 3డి యానిమేషన్స్ తో క్యుఆర్ కోడ్ కలిగిన స్టడి మెటీరియల్ ను విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డిజిటల్ స్టడీ మెటీరియల్ ద్వారా ప్రతి విద్యార్థికి అర్థం చేసుకోవచ్చునని అన్నారు. పదో తరగతి పరీక్షలు త్వరలో జరుగనున్న తరుణంలో డిజిటల్ స్టడీ మెటీరియల్ బాగా ఉపయోగ పడతాయని అన్నారు. విద్యకు,విద్యా ప్రమాణాలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి , మండల విద్యాధికారి అనిల్ గౌడ్, పార్టీ మండల అధ్య క్షులు ఆనంద్ గౌడ్, నాయకులు నరసింహారెడ్డి రవీందర్ శ్రీనివాస్ శివరాం రెడ్డి నరసింహారెడ్డి దండు ఆనంద్ వేణుగోపాల్ గడ్డం నరేష్ ప్రభుత్వపాఠశాల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పనితీరే కీలకం

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి):

గ్రామపంచాయతీ అభివృద్ధిలో పంచాయతీ సెక్రెటరీల పనితీరు కీలకమని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డివిజనల్, మండల స్థాయి పంచాయతీ అధికారులు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాలలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్, హౌస్ టాక్స్ కలెక్షన్, గ్రామపంచాయతీ ఇన్స్పెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్, సెల్ టవర్ లైసెన్స్, ఇంటి పరిమిషన్లు, మల్టీపర్పస్ వర్కర్స్ శాలరీలు సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది అన్నారు. పంచాయతీ సెక్రటరీలు సంక్షేమ పథకాలు అమలులో వారి పనితీరు హర్షనీయమని, ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలవలు, రోడ్లు, పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, తడి చెత్త పొడి చెత్త ట్రాక్టర్ ద్వారా కలెక్ట్ చేయడం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు సంక్షేమ పథకాల అన్లైన్ డేటా ఎంట్రీలో 100% పురోగతి సాధించాలని చెప్పడం జరిగిందని పంచాయతీ సెక్రటరీలు విధుల యందు సమయపాలన పాటించాలని ఉదయం 9 గంటలకల్లా కార్యాలయాలకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలుగా మారాలని పంచాయతీ సెక్రటరీల పనితీరుతోనే అది సాధ్యపడుతుందని కలెక్టర్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి సురేష్, డిఎల్ పిఓ నరసాపూర్ సాయిబాబా, తూప్రాన్ యాదయ్య అన్ని మండలాల ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో

ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)

ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని,6 గ్యారంటీలతో పాటు, ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ, పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల మార్క్స్ భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ ను ఉద్దేశించి సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చింది అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇందులో ఒకటి అర వాగ్దానాలు తప్ప అత్యధికం అలాగే ఉన్నాయి. రైతులకు చేస్తానన్న రుణమాఫీ ఇంకా సగానికి సగం అమలు కాలేదు, రైతుబంధు ఎకరాకు 15000 ఇస్తానని 12000 మాత్రమే ప్రకటించారు. ఆడిన మాట తప్పింద్రు. రైతు భరోసా ఇప్పటికే ఒక పంట ఎగ్గొట్టారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థానంలో ఉచితంగా ఇస్తానని చెప్పిన ఇందిరమ్మ ఇళ్ల పథకం సంవత్సరం దాటిన ఆచరణ రూపంలో రాలేదు, పొడుభూములకు పట్టాలిస్తానని, ప్రభుత్వంఇప్పటికీ ఇవ్వలేదు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను అమలు చేయలేదు. చేయూత పథకం ఇంకా ప్రారంభమే కాలేదు. ధరణి దోషులపై చర్యలు లేవు, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి లేదు విద్యా,వైద్య రంగాలలో ఏం మార్పు రాలేదు. ప్రజా పాలన అసలే లేదు, బుట్టకపు ఎన్కౌంటర్లు యధావిధిగా కొనసాగుతున్నాయి. పౌర ప్రజాస్వామ్య హక్కులు కాలరాయపడుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20వ తారీఖున హైదరాబాద్ లో ప్రజా ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించ తలపెట్టింది కావున అన్నివర్గాల ప్రజలు ప్రజాసామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నాం. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్ పివోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, ఐఎఫ్టీయూ జిల్లా
కార్యదర్శి డి.బ్రహ్మానందం అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, ఏఐకెఎమ్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్,
పిఓడ బ్ల్యు జిల్లా అధ్యక్షురాలు జ్యోతి,ప్రధాన కార్యద ర్శి అరుణ,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మేకల రామన్న, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ఐఎఫ్ టియు నాయకులు సురేందర్, మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సెక్రటరీలకు రక్షణ కల్పించండి

నర్సాపూర్, జనవరి29 (జనంసాక్షి)

గ్రామపంచాయతీ కార్యదర్శులకు రక్షణ కల్పించాలని బుధవారం పంచాయతీ కార్యదర్శులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ మండలంలో జక్కపల్లి, నదినాయపల్లి,రామచంద్రపూర్, లింగాపూర్ ప్రజాపాలన గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులపై అనర్హులకు ప్రభుత్వ పథకాలు రాకపోవడంతో అసభ్య పదజాలంతో దుషిస్తున్నారని వారు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు భద్రత కలించాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

84 మంది విద్యార్థులకు అస్వస్థత

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29 (జనంసాక్షి):

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో 84 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని కందుకూరు గురుకులంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో మంచం పట్టారు విద్యార్థులు . ఈ విషయాన్ని తొక్కిపెట్టి బయటకు పొక్కకుండా విద్యార్థులను బెదిరించాడు ప్రిన్సిపల్. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు వడ్డించగా.. వాటిని తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్లోనే నర్సు సాయంతో వైద్యం చేయించేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపల్. ఈ క్రమంలో కొంత మంది పరిస్థితి సీరియస్ కావడంతో వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించడంతో బయటకు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు వెంటనే వెళ్లగా గురుకులానికి తాళం వేసి వాళ్లను అడ్డుకున్నారు ప్రిన్సిపల్. పోలీసులను పిలిపించిన తర్వాత తల్లిదండ్రులను లోపలికి వదిలిన ప్రిన్సిపల్.. కనీసం సమాచారం ఇవ్వక పోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు

బుసిరెడ్డిపల్లి బస్సును పునరుద్ధరించాలి

ప్రజా సంఘాల నేతల వినతి

వనపర్తి,జనవరి29 (జనంసాక్షి):

అకారణంగా నిలిపివేసిన వనపర్తి బుసిరెడ్డిపల్లి బస్సును పునరుద్ధరించాలని కోరుతూ పలు ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వనపర్తి డిపో నుండి దవాజి పల్లి, దొండాయిపల్లి,కొత్తపేట, మాందాపూర్, రాయినపల్లి గ్రామాల మీదుగా బుసిరెడ్డిపల్లి గ్రామానికిబస్సు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో దవాజ్ పల్లి, దొండాయపల్లి గ్రామాల మీదుగా,అదేవిధంగా అన్నారం, కొత్తపేట రూట్లలో బుసిరెడ్డిపల్లి గ్రామాలకు రెండు బస్సు సర్వీసులు ఉండేవని, అన్నారం, కొత్తపేట రోడ్డు సౌకర్యం బాగాలేదని సర్వీసులు రద్దు చేయడం జరిగిందన్నారు. ఆరు గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన పానుగల్లుకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ,కాబట్టి పాత సర్వీసులను పునరుద్ధరించాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, ఐద్వా జిల్లా సహా కార్యదర్శి ఉమా,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డి కోపుల మహేష్. రైతు సంఘం మండల నాయకులు బాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 జనవరి 2025

విజ్ఞాన శాస్త్రాన్ని ఆచరణాత్మక బోధిస్తేనే పట్టు

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) : విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రాన్ని ఆచరణాత్మక విధానం ద్వారా బోధిస్తే సులువుగా పట్టు సాధిస్తారని, బాగా గుర్తు ఉండిపోతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక నిధులతో కొనుగోలు చేసిన 116 సైన్స్ ఫెయిర్ కిట్లను ప్రభుత్వ పాఠశాలలకు కలక్టర్ చేతులమీదుగా అందజేశారు. ఇండియా లిట్రసి ప్రోగ్రాం వారు రూపొందించిన సైన్స్ ఫెయిర్ కిట్లను ఇప్పటి వరకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు 83 ప్రభుత్వ పాఠశాలలకు 244 యూనిట్లు అందించి ఉండగా మిగిలిన పాఠశాలలకు రూ. 6.57 లక్షల వ్యయంతో కలెక్టర్ ప్రత్యేక నిధుల ప్రత్యేక నిధుల నుండి కొనుగోలు చేసి పంపిణీ చేశారు. సైన్స్ ఫెయిర్ కోట్లను ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలిపేందుకు ఇండియా లిట్రసి ప్రోగ్రాం వారు సైన్స్ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం సైతం నిర్వహించారు. వనపర్తి జిల్లాలో గత 35 సంవత్సరాలుగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ సెక్రటరీ చిన్నమ్మ థామస్ ను కొనియాడారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం కలెక్టర్ తీవ్రమైన కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ మాట్లాడుతూ జిల్లాలో 35 సంవత్సరాలుగా తమ ఎన్జీవో సేవలందిస్తుందని చెప్పారు. ఇండియన్ డ్రెసి ప్రోగ్రాం ద్వారా ఈ సైన్స్ కిట్లను జిల్లాకు పరిచయం చేశామని చెప్పారు. భవిష్యత్తులోనూ జిల్లా అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని చెప్పారు. ఆర్డిఎస్ తరఫున ఇద్దరు అనాథ విద్యార్థినులకు లక్ష రూపాయల స్కాలర్షిప్ చెక్కును అందజేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నందుకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తరఫున జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ , జిల్లా సైన్స్ అధికారికి మెమెంటోలు అందజేశారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో, కే.జి.బి.విలో పదో తరగతి, ఇంటర్మీడియట్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ ప్రశంసా పత్రాలు, మెమోటోలను అందించారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన ఏడుపాయల కీర్తి

పాపన్నపేట, జనవరి 29 (జనంసాక్షి) : ఆ నేల మాఘ స్నానాలతో పులకరించింది. తల్లి ఆశీస్సుల కోసం జనం ముందడుగు వేశారు. ఎల్లలు దాటిన ఏడుపాయల కీర్తి ఆశేష జనవాహిని తో వనదుర్గా క్షేత్రం ఆధ్యాత్మిక సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. జనవరి 29 బుధవారం మాఘ అమావాస్య సందర్భంగా దుర్గమ్మకు విశేష అలంకరణ చేశారు. అర్చకులు శంకర్ శర్మ, పార్థివ శర్మ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పెరుగు అన్నం నైవేద్యం మాతకు నివేదించారు. ఉదయం నుండి వనదుర్గా క్షేత్రానికి భారీగా తరలి వచ్చారు. మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం వనదుర్గమ్మను దర్శించుకున్నారు. ఒడి బియ్యం, బోనాలు, తలానీలాలు సమర్పించారు. కానుకలు హుండీలో వేశారు. బండ రాళ్లు, వృక్షాల కింద భక్తులు రుచికరమైన ఆహారాన్ని తిన్నారు. సూదూర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో వనంలో సందడి నెలకొంది. హైదరాబాద్ నుండి పోతంశెట్టి పల్లి నుండి వంతెనల మీదుగా భక్తుల రాకపోకలు ఎక్కువగా సాగాయి. ప్రయాణికుల దృష్ట్యా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపింది. టేకుల గడ్డ ప్రాంతం జనాలతో రద్దీగా కొనసాగింది. పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తూ నిర్వహించారు. వనదుర్గా ప్రాజెక్ట్ నీటితో పర్యాటకులను కనువిందు చేసింది. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఉదయం అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్పి ఉదయ్ కుమార్ బందోబస్తూ పర్యవేక్షించారు. ఆలయ ఈఓ చంద్ర శేఖర్ తగు ఏర్పాట్లు చేశారు. సుమారు 80 వేల మంది భక్తులు ఇక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

జోగిపేట హనుమన్ చౌరస్తా వద్ద కారు బీభత్సం

● దుకాణాలవైపు వేగంతో దూసుకెళ్లిన కారు

● ముగ్గురికి తీవ్ర గాయాలు, తప్పిన పెను ప్రమాదం

జోగిపేట, జనవరి 29 (జనం సాక్షి) : జోగిపేట హనుమాన్ చౌరస్తా వద్ద బుధవారం మధ్యాహ్నం బ్రిజా కార్ బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో అతివేగంగా డ్రైవర్ కారు నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణాలవైపు దూసుకెళ్లింది. రోడ్డుపై వస్తున్న ముగ్గురి వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాలను అతివేగంగా ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న టిడిపి పార్టీ గద్దెకు కారు ఢీకొని ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జోగిపేట నుంచి అన్నాసాగర్ వైపు వెళ్తున్న ఆక్సన్ పల్లి గ్రామానికి చెందిన రాజు, కన్ సానిపల్లి నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గ్రామానికి చెందిన సంజీవులు, బాలయ్యలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వస్తున్న క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ఎక్సెల్ వాహనాన్ని కారు ఢీకొట్టడంతో సంజీవులు, బాలయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని జోగిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురికి వైద్య అధికారులు ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. బొడ్మట్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మొగులయ్య వాహనం ఓనర్ అని పోలీసులు గుర్తించారు. కారు ఓనర్ మొగులయ్య, డ్రైవర్ ఈసా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మత్తులో డ్రైవర్ కారు నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని జోగిపేట ఏఎస్ఐ గౌస్ తెలిపారు.

పిల్లలకు ఎక్కువగా ఫైబర్ ఫుడ్ ఇవ్వాలి

● ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సాయిరాం

సిద్దిపేట టౌన్, జనవరి 29 (జనంసాక్షి) : సిద్దిపేటలో గల స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల లో బుధవారం రోజున హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సుమారుగా 232 మంది విద్యార్థులకు పరిశీలించి అవసరమైనటువంటి విద్యార్థులకు ఉచితంగా వైద్యం చేయడం జరిగింది మరియు మెడిసిన్ కూడా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యమైనవని అందులో ఎక్కువ ఫైబర్ కంటెంట్ ఉండేలాగా ఆహారాన్ని తల్లిదండ్రులు పిల్లలకి ఇవ్వాలని అన్నారు. జలుబు దగ్గు ఉన్నప్పుడు పిల్లలకి ఒకరి ద్వారా మిగతా వాళ్ళకి వేగంగా సంక్రమించే అవకాశం ఉంది కాబట్టి ఆ సమయంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలని చేతులను శుభ్రంగా కడుకోవాలని మరియు ఉదయం రాత్రి రెండుసార్లు కచ్చితంగా బ్రష్ చేయడము రెండుసార్లు స్నానం చేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మోతుకు నరేష్ కుమార్ , సాయి చరణ్, పోషకులు, వైద్య సిబ్బంది, ఆచార్యులు మరియు విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

జోగిపేట, జనవరి 29 (జనం సాక్షి) : రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పేస్కేలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అందోల్ మండల ఉపాధి హామీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ అర్చన, కంప్యూటర్ ఆపరేటర్లు నందకుమార్, చంద్రకళ, ఈజీఎస్ ఉదయ్ కుమార్, సిఓలు మొగులయ్య, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన పేట మాజీ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

సదాశివపేట, జనవరి 29 (జనం సాక్షి) : బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌ల ఆశీస్సులతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నాయకత్వంలో సదాశివపేట పట్టణ అభివృద్ధికి పాటు పడి, ఇటీవల పదవి కాలం ముగించుకున్న సదాశివపేట మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు బుధవారం హైదరాబాద్ లో మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని హరీష్ రావు, కేటీఆర్ లు శాల్వలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, మాజీ వైస్ చైర్మన్ చింతాగోపాల్, మాజీ కౌన్సిలర్‌లు ఇంద్రమోహన్ గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, సాతాని శ్రీశైలం, పిల్లిగుండ్ల వీరేశం, మోబిన్, నాయకులు ఆత్మకూర్ నాగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి కోసం భారీ విరాళం

దీపనగండ్ల, జనవరి 29 (జనంసాక్షి) : యు.పి.ఎస్ ప్రాథమికోన్నత పాఠశాల దవాజిపల్లి జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కోసం కాంట్రాక్టర్ తిరుపతయ్య 50 వేల రూపాయలు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, కాంట్రాక్టర్ తిరుపతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కురుమూర్తి ఉపాధ్యాయులు డి రాధాకృష్ణ, లక్ష్మణ్, పరమేశ్వరి, విజయ లలిత, శరణ్య బాగ్యశ్రీ, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం చాలా అభినందనీయమని అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఐదువేల రూపాయలు, వివేకానంద యువజన సంఘం 5000 రూపాయలు, రవికుమార్ రెడ్డి 5000 రూపాయలు, గ్రామ పెద్దలు అందరు కలిసి 75 వేల రూపాయలు పాఠశాల అభివృద్ధి కోసం విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు వెంకటేష్ నాయుడు, రాము యాదవ్, వెంకటయ్య హాజరయ్యారు. దాతలను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

ఆరోపణ నేపథ్యంలో న్యాల్‌కల్ ఎంపీఓ బదిలీ

న్యాల్‌కల్, జనవరి 29 (జనంసాక్షి) : ఆరోపణ నేపథ్యంలో న్యాల్ కల్ మండల పంచాయితీ అభివృద్ధి అధికారి (ఎంపీఓ) బీ.సురేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ రాజ్ అధికారి (డీపిఓ) సాయి బాబా ఉత్తర్వులు జారీ చేశారు. మండల ఎంపీఓ గా విధులు నిర్వహిస్తున్న సురేష్ కుమార్ ను సిర్గాపూర్ మండల ఎంపిఓ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని రేజింతల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.అరుణ జ్యోతితో పాటు మరి కొందరు పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అధికార పార్టీకి చెందిన పార్టీ నాయకులు ఎంపీఓ పై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు సమాచారం. డిసెంబర్.11.2024న లిఖిత పూర్వకంగా మండలంలోని ఓ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి డీపిఓ కు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, ఇతరత్రా ఆరోపణ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం మేరకు జిల్లా పంచాయతీరాజ్ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ చేపట్టిన అనంతరం ఎంపీఓ సురేష్ కుమార్ ను నారాయణఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ మండల ఎంపీఓగా బదిలీ చేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

తలకొండపల్లి, జనవరి 29 (జనంసాక్షి) : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణ పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. బుధవారం తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అందరూ సీరియస్‌గా పనిచేయాలని అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా వేసి ఉంచాలని పోలీసులను ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండొద్దన్నారు. పోలీస్ స్టేషన్లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చూసి మెచ్చుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు వివరించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో పరిధిలో నమోదైన కేసులను కేసులకు సంబంధించిన ఫైలను రికార్డులను పరిశీలించి పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ సాంకేతిక పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఫంక్షన్ వర్టికల్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసులు ప్రజలు మన్ననలు పొందేల విధులు నిర్వహించాలని మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. దాదాపు గంట పాటు అధికారులతో కులంకుశంగా మాట్లాడారు. ఈ యొక్క కార్యక్రమంలో శంషాబాద్ డిసిపి బి.రాజేష్, అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, షాద్ నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్, స్థానిక ఎస్సై ఏ. శ్రీకాంత్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లోనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

● రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్

నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) : రాబోయే ఈ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేసి మాట నిలుపు కావాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కెంచీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మేనిఫెస్టోలో పెట్టిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ స్థానిక సంస్థల రిజర్వేషన్లు తదితర అంశాల ను అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి బీసీ ప్రజానీ కం ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. బలహీన వర్గాల ఆశీస్సులతో గద్దెనెక్కిన సి ఎం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమ లు చేసి బీసీ ప్రజల మన్నన లు పొందాలని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా తగ్గిస్తే క్షేత్రస్థాయిలో బిసిలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

● మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్

తూప్రాన్, జనవరి 29 (జనంసాక్షి) : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తుందని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణన్ తెలిపారు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల క్రీడోత్సవాల ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థి దశ నుండి క్రీడలలో పాల్గొని మంచి క్రీడాకారులుగా గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు క్రీడల వల్ల మానసిక ఉల్లాసము ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణజిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, పేట మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, అథ్లెటిక్ అసోసియేషన్ మెదక్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, క్రీడోత్సవాల పరిశీలకులు గంగమోహన్ రవికుమార్ టోర్నమెంట్ కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ శర్మ మాట్లాడారు. టోర్నమెంట్లో ఉమ్మడి పది జిల్లాలలో హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల నుండి 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్, మేనేజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, మాధవరెడ్డి, గోవర్ధన్, చంద్రమోహన్, మాలతి, లతిఫా ఉన్నిస, పద్మ, సరోజినీ, దేవేందర్ రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పైనే రియల్ ఎస్టేట్ ఆశలు..!

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై పలు రంగాలు భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో ఒకటి రియల్ ఎస్టేట్ రంగం.

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై పలు రంగాలు భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో ఒకటి రియల్ ఎస్టేట్ రంగం. వాస్తవంగా బడ్జెట్ అంటే.. అన్ని వర్గాలు తమకు ఏదైనా శుభవార్త చెబుతారేమోనని ఆశపడుతుంటాయి.

ఈ సారి ప్రభుత్వం, బడ్జెట్ వైపు రియల్ ఎస్టేట్ రంగం సైతం భారీగానే ఆశలు పెట్టుకున్నది. గత ఏడాది రియల్ ఎస్టేట్ రంగం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నది.

ఈ క్రమంలో బడ్జెట్‌లో ఏమైనా ఊరట కలుగుతుందేమోనని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం గృహ రుణాల వడ్డీ రేట్లు పెరగడంతో పాటు ఇండ్లు కొనుగోలు చేస్తే వర్తించే పన్ను మినహాయింపులు పరిమితంగానే ఉన్నాయి. భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో వేతన జీవుల ఆదాయం ఎక్కువగా ఇంటి అవసరాలకే సరిపోతుంది. దాంతో సొంతింటి కల చివరకు.. కలగానే మిగిలిపోతున్నది. రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉంటేనే.. మిగతా రంగాల వ్యాపారాల్లోనూ పెరుగుదల ఉంటుందని.. లేదంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తమకు ప్రయోజనాలు కల్పిస్తుందని గృహనిర్మాణదారులతో పాటు కొనుగోలుదారులు ఆశిస్తున్నారు. సిమెంట్, స్టీల్, ఐరన్‌తో పాటు నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రికి సంబంధించిన జీఎస్టీని తగ్గించడంతో పాటు గ్రీన్ బిల్డింగ్స్‌కు ప్రోత్సాహకాలు అందించాలని కోరుకుంటున్నారు. ఇక గృహ కొనుగోలుదారులు మాత్రం ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 24 కింద వడ్డీరేట్లపై ఇన్‌కం ట్యాక్స్ పన్నులో మినహాయింపు పరిధిని రూ.5లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. ప్రస్తుతం గృహ రుణ వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.2 లక్షలుగా ఉన్నది.

నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపుతో పాటు వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.5లక్షలకు పరిమితి పెంచితే రియల్ ఎస్టేట్ రంగం భారీగా వృద్ధి చెందే అవకాశం ఉందని

అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గృహ రుణ వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను రూ.2లక్షలు బాగా తక్కువ అని పేర్కొంటున్నారు. పన్ను మినహాయింపును పరిమితి రూ.5లక్షలకు పెంచితే ఇండ్లను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తారని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. దాంతో రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో పాటు ఆదాయపు పన్ను రూపంలోనూ ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. మరి ఈ సారి బడ్జెట్‌లో ఏమైనా నిర్మాణ రంగానికి కేంద్రం ఊరట కల్పిస్తుందా? లేదా? వేచి చూడాల్సిందే.

వరుస పతనాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్ పడింది. బ్యాంకింగ్, వడ్డీరేటుకు సంబంధించిన రంగాల షేర్లకు లభించిన మద్దతుతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఆర్థిక వ్యవస్థలోకి భారీగా నిధులను చొప్పించడానికి రిజర్వుబ్యాంక్ సిద్ధమవుతున్నట్లు వచ్చిన వార్తలు మదుపరులను కొనుగోళ్లవైపు నడిపించాయి.

వరుస పతనాలకు బ్రేక్

సెన్సెక్స్ 535, నిఫ్టీ 128 పాయింట్ల లాభం

ముంబై, జనవరి 28 : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్ పడింది. బ్యాంకింగ్, వడ్డీరేటుకు సంబంధించిన రంగాల షేర్లకు లభించిన మద్దతుతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఆర్థిక వ్యవస్థలోకి భారీగా నిధులను చొప్పించడానికి రిజర్వుబ్యాంక్ సిద్ధమవుతున్నట్లు వచ్చిన వార్తలు మదుపరులను కొనుగోళ్లవైపు నడిపించాయి. దీంతో ఇంట్రాడే వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 535.24 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 75,901.41 వద్ద ముగియగా, 128.10 పాయింట్లు అందుకొని నిఫ్టీ 22,957.25 వద్ద స్థిరపడింది.



గడిచిన రెండు రోజులుగా భారీగా పతనమైన సూచీలకు రిలీఫ్ ర్యాలీ దొరికిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మారుతి, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్‌ఫార్మా, లార్సెన్ అండ్ టుబ్రో, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, నెస్లె, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ సూచీ అత్యధికంగా 1.49 శాతం లాభపడగా, ఆర్థిక సేవలు 1.45 శాతం, రియల్టీ 1.27 శాతం, ఆటో 1.16 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ, ఐటీ రంగ షేర్లు పతనం చెందాయి.

పన్ను ఊరట దక్కేనా?

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం (ఫిబ్రవరి 1) బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) విధానానికి సంబంధించి ట్యాక్స్‌పేయర్స్, సగటు వేతన జీవులు భారీ ఆశల్నే పెట్టుకున్నారు.

అటు పాతది.. ఇటు కొత్తది

రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను విధానాల్లో ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్న మార్పులివే

న్యూఢిల్లీ, జనవరి 28: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం (ఫిబ్రవరి 1) బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) విధానానికి సంబంధించి ట్యాక్స్‌పేయర్స్, సగటు వేతన జీవులు భారీ ఆశల్నే పెట్టుకున్నారు. పాత, కొత్త ఆదాయ పన్ను విధానాలను అనుసరించేవారు మాకివి కావాలన్న డిమాండ్లను వ్యక్తం చేస్తున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ క్షీణత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తగ్గుతున్న వృద్ధిరేటు అవకాశాలు, అధిక వడ్డీరేట్లు, నిరాశపరుస్తున్న ఉత్పత్తి, మందగించిన వినిమయ సామర్థ్యం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం వంటివి ఇప్పుడు మోదీ సర్కారుకు సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ ఎవరి అంచనాల్ని, మరెవరి ఆశల్ని ఎంతవరకు నెరవేరుస్తుందన్నది మిక్కిలి ప్రాధాన్యతగా నిలుస్తున్నది.

పన్ను కోతలు, మినహాయింపులు లేకుండా సరళతరంగా రూపొందించినదే కొత్త పన్ను విధానం. 2020 బడ్జెట్‌లో దీన్ని మోదీ సర్కారు పరిచయం చేసింది. వార్షిక ఆదాయ పరిమితులు, దానికి తగ్గట్టు పన్ను శ్లాబులే ఇందులో ఉంటాయి. ఇక పాత పన్ను విధానంలో రకరకాల సెక్షన్ల కింద వివిధ పెట్టుబడులు, పొదుపు, ఆదాయ-వ్యయాలపై పన్ను కోతలు, మినహాయింపులు వర్తిస్తాయి. ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రకారం ప్రస్తుతం దేశంలోని 72 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్.. కొత్త ఆదాయ పన్ను విధానాన్నే అనుసరిస్తున్నారు. 28 శాతం మంది పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నారు. వీరిని కూడా కొత్త ఆదాయ పన్ను విధానంలోకే తేవాలని గత కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రతీ బడ్జెట్‌లో పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదు. కొత్త పన్ను విధానానికే మెరుగులు దిద్దుతూ వస్తున్నది. మరి ఈసారైనా ఈ రెండు విధానాల్లో మార్పులు కావాలని కోరుతున్న ట్యాక్స్‌పేయర్స్ ఆశలు ఫలిస్తాయా? లేక ఎప్పట్లాగే కొత్త పన్ను విధానానికి సంబంధించి వచ్చే డిమాండ్లపైనే దృష్టి సారిస్తారా? అన్నది వేచిచూడాల్సిందే.

బడ్జెట్‌లో ట్యాక్స్ పేయర్స్ డిమాండ్లు..

పాత పన్ను విధానంలో..

పన్ను మినహాయింపు: కనీస పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలి.

స్టాండర్డ్ డిడక్షన్: కొత్త పన్ను విధానంలో ఉన్నట్టుగానే స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75,000కు పెంచాలి.

గృహ రుణం: సెక్షన్ 24 కింద గృహ రుణం ఈఎంఐలో వడ్డీకి సంబంధించి ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలుగా ఉన్న పన్ను మినహాయింపు పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలి.

సెక్షన్ 80సీ, డీ: సెక్షన్ 80సీ కింద వర్తిస్తున్న గరిష్ఠ పన్ను మినహాయింపు పరిమితిని ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి. 80డీ కిందనున్న పన్ను ప్రయోజనాలను రూ.25వేల నుంచి రూ.40వేలకు పెంచాలి. సీనియర్ సిటిజన్లకైతే ఇప్పుడున్న రూ.50వేలు కాకుండా రూ.75వేలుగా నిర్ణయించాలి.

కొత్త పన్ను విధానంలో..

పన్ను రేట్లు: వార్షిక ఆదాయం రూ.12-15 లక్షల మధ్య ఉంటే పన్ను రేటును 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలి. రూ.15-20 లక్షల మధ్య ఉన్నట్టైతే ఇప్పుడున్న 30 శాతం నుంచి 20 శాతానికి తీసుకురావాలి. రూ.20 లక్షలపైన వార్షిక ఆదాయం ఉన్నవారికి 30 శాతం విధించాలి. దీనివల్ల మధ్యతరగతి, ముఖ్యంగా వేతన జీవులకు ఊరట లభిస్తుంది. అలాగే ఆర్థికాభివృద్ధికి కీలకమైన వినిమయ శక్తి పుంజుకుంటుందని చెప్తున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్: రూ.75వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలి.

ఎన్‌పీఎస్: నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)కు వెళ్లే ఉద్యోగుల విరాళాలకు సెక్షన్ 80సీసీడీ(1బీ) కిందనున్న రూ.50వేల పన్ను మినహాయింపును వర్తింపజేయాలని కొత్త పన్ను విధానంలోని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. అప్పుడే రిటైర్మెంట్ నిధిని పెంపొందించుకోవడం, ఆర్థిక భద్రత మెరుగుపడటం, ప్రావిడెంట్ ఫండ్‌కే కాకుండా ఎన్‌పీఎస్‌కూ ఆదరణ పెరగడం జరుగుతుందని మెజారిటీ పన్ను చెల్లింపుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాత పన్ను విధానంలో సెక్షన్ 80సీసీడీ (1) కింద ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపు ఉన్నది. అయితే సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద ఎన్‌పీఎస్‌కు చెల్లించే మొత్తాలకు సంబంధించి అదనంగా మరో రూ.50,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. దీంతో ఈసారి బడ్జెట్‌లో ఈ సదుపాయం కొత్త పన్ను విధానం ఎంచుకొన్న ట్యాక్స్‌పేయర్స్‌కూ కల్పించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

సెక్షన్ 80సీ, డీ: సెక్షన్ 80సీ కింద వర్తిస్తున్న గరిష్ఠ పన్ను మినహాయింపు పరిమితిని ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి. 80డీ కిందనున్న పన్ను ప్రయోజనాలను రూ.25వేల నుంచి రూ.40వేలకు పెంచాలి. సీనియర్ సిటిజన్లకైతే ఇప్పుడున్న రూ.50వేలు కాకుండా రూ.75వేలుగా నిర్ణయించాలి.

నడవడం మర్చిపోయా.. విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నా..

ముచ్చటగా మూడో సారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షంలోనే చిక్కుకుపోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆమె తిరిగి ఎప్పుడు ఇక్కడకి వస్తారనే దానిపై ఇంకా క్లారిటీ లేదు. అయితే తాజాగా ఆమె తన అనుభవాలను పంచుకున్నారు. అంతరిక్షంలోనే 7 నెలలుగా ఉండడంతో తాను నడవడం మర్చిపోయానని చెప్పారు. అలాగే పడుకొని విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నాని స్పష్టం చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

ముచ్చటగా మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లి పలు సాంకేతిక కారణాల వల్ల అక్కడే చిక్కుకుపోయిన వ్యోమగామి సునీతా విలియమ్స్ షాకింగ్ కామెంట్లు చేశారు. గత 7 నెలలుగా తాను అక్కడే ఉండడం వల్ల నడవడం కూడా మర్చిపోయాయని చెప్పారు. ప్రస్తుతం తాను ఎలా నడిచేదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నట్లు వివరించారు. అలాగే జీరో గ్రావిటీ వద్ద పడుకొని విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నట్లు స్పష్టం చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

2024 జూన్ 6వ తేదీన.. ఎనిమిది రోజుల మిషన్‌లో భాగంగా సునీతా విలియమ్స్, బుచ్‌విల్ మోర్‌లు రోదసిలోకి వెళ్లారు. బోయింగ్ స్టార్ లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన వీరు జూన్ 14వ తేదీనే తిరిగి రావాల్సి ఉంది. కానీ వారు వెళ్లిన వ్యోమనౌకలో హీలియం లీకేజీ కాగా.. పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అయితే వాటిని పరిక్షరించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా అవి సఫలం కావడం లేదు. ఈక్రమంలోనే వారు గత ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు.

గత 7 నెలలుగా తాను అక్కడే ఉండడం వల్ల నడవడం కూడా మర్చిపోయాయని చెప్పారు. ప్రస్తుతం తాను ఎలా నడిచేదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నట్లు వివరించారు. అలాగే జీరో గ్రావిటీ వద్ద పడుకొని విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నట్లు స్పష్టం చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

2024 జూన్ 6వ తేదీన.. ఎనిమిది రోజుల మిషన్‌లో భాగంగా సునీతా విలియమ్స్, బుచ్‌విల్ మోర్‌లు రోదసిలోకి వెళ్లారు. బోయింగ్ స్టార్ లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన వీరు జూన్ 14వ తేదీనే తిరిగి రావాల్సి ఉంది.

గత ఏడు నెలలుగా అక్కడే ఉంటున్న సునీతా విలియమ్స్ తాజాగా అంతరిక్షం నుంచే విద్యార్థులతో మాట్లాడారు. ఈక్రమంలోనే ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తాను చాలా కాలంగా అంతరిక్షంలో ఉండడంతో నడవడం మర్చిపోయినట్లు వివరించారు. అసలు తాను గతంలో ఎలా నడిచేవారో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు స్పష్టం చేశారు. చాలా కాలంగా తాను నడవడం, కూర్చోవడం చేయడం లేదని చెప్పారు. కనీసం పడుకుని కూడా విశ్రాంతి తీసుకోలేకపోతున్నట్లు వివరించారు.

జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండడంతో నేలపై నడిచిన అనుభవాన్ని పూర్తిగా మర్చిపోయినట్లు వెల్లడించారు. నెల రోజుల్లోనే తిరిగి వస్తామనే ఉద్దేశంతోనే తాము వెళ్లినప్పటికీ.. ఇన్ని నెలలుగా అక్కడే చిక్కుకుపోవడం షాకింగ్‌గా ఉందని పేర్కొన్నారు.

అయితే ఇలాగే మరింత ఎక్కువ కాలం వ్యోమగాములు అక్కడే ఉండాల్సి వస్తే మానసిక సమస్యలతో పాటు శారీరకంగానూ అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా జీరో గ్రావిటీ వద్ద ఉండడం వల్ల నడవడం, కూర్చోవడం వంటివేమీ చేయలేకపోవడంతో కండరాల క్షీణత బారిన పడతారని, ఎముకల పటిష్టత తగ్గి, పోషకాలలేమితో అనేక సమస్యలు ఎదుర్కుంటారని వివరిస్తున్నారు. తాజాగా వీరిద్దరినీ తిరిగి భూమ్మీదకు తీసుకు రావాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఎలాన్ మస్క్‌ను కోరారు. ఈ విషయాన్ని నేరుగా మస్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. బైడెన్ ప్రభుత్వం వ్యోమగాములను భూమ్మీదకు తీసుకు వచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇది చాలా దారుణం అన్నారు. అయితే నాసా క్రూ-7 ద్వారా వారిని త్వరలోనే తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చూడాలి మరి వీరు ఎప్పుడు తిరిగి భూమ్మీదకు రాబోతున్నారనేది.

మహా కుంభమేళాలో తొక్కిసలాట వేళ..

కోట్లాది మంది హాజరైన ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఈ తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదంగా మారింది. పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోగా.. చాలా మందికి గాయాలు అయినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. అయితే గతంలోనూ కుంభమేళా సమయంలో తొక్కిసలాట ఘటనలు జరిగాయి. కుంభమేళా మాత్రమే కాకుండా.. పలు ఆధ్యాత్మిక సమ్మేళనాల్లోనూ ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి.

మహా కుంభమేళాలో మౌనీ అమావాస్య సందర్భంగా ఇవాళ భారీగా భక్తులు తరలివచ్చారు. నిత్యం కోటి మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తుండగా.. ఇవాళ ఒక్కరోజే 12 కోట్లకు పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, స్థానిక అధికారులు తీసుకున్న చర్యలు సరిపోలేదు. అయితే గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు చేసేందుకు భారీగా భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఇందులో పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. చాలా మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ఈ ఘటన గురించి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో చర్చిస్తున్నట్లు తెలిపారు.

1954 కుంభమేళా

ప్రస్తుతం 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభమేళా జరుగుతోంది. అయితే ఇంతకుముందు కుంభమేళాలో కూడా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి కుంభమేళా 1954లో నిర్వహించారు. ఆ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన తొక్కిసలాట చోటుచేసుకోగా.. దేశ చరిత్రలో జరిగిన పెను విషాదాల్లో అది ఒకటిగా నిలిచింది. ఆ దుర్ఘటనలో 800 మంది ప్రాణాలు కోల్పోగా.. 2వేల మంది గాయాలపాలయ్యారు. అప్పుడు కూడా సరిగ్గా మౌని అమావాస్య నాడే చోటుచేసుకోవడం గమనార్హం. అప్పుడు మహా కుంభమేళాలో ఒక ఏనుగు అదుపుతప్పి భక్తులపైకి దూసుకురావడంతో తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

1986 కుంభమేళా తొక్కిసలాట

1986 ఏప్రిల్ 14వ తేదీన కుంభమేళా సందర్భంగా అప్పటి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి వీర్‌బహదూర్ సింగ్‌తోపాటు ఆయన పలు రాష్ట్రాల సీఎంలు, ఎంపీలను తీసుకొని హరిద్వార్‌లో పుణ్యస్నానాలకు వెళ్లారు. వీఐపీలు ఎక్కువగా రావడంతో భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు, భద్రతా సిబ్బంది అడ్డుకోలేకపోయారు. ఆ రోజున జరిగిన తొక్కిసలాటలో 200 మంది ప్రాణాలు కోల్పోయారు.

2003 కుంభమేళా తొక్కిసలాట

2003 కుంభమేళా సమయంలోనూ తొక్కిసలాట చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని నాసిక్‌లోని గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు భారీగా భక్తులు తరలివెళ్లారు. దీంతో ఆ సందర్భంగా జరిగిన తొక్కి సలాటలో 39 మంది భక్తులు మృతి చెందారు.

2013 కుంభమేళా తొక్కిసలాట

2013లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్(ప్రయాగ్‌రాజ్)లో జరిగిన కుంభమేళాలో కూడా ఇలాంటి దుర్ఘటనే జరిగింది. ఆ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన చోటుచేసుకున్న ఆ తొక్కిసలాటలో 42 మంది భక్తులు మరణించారు. కుంభమేళాలో ఏర్పాటు చేసిన ఒక ఫుట్ బ్రిడ్జ్ కూలిపోవడమే తొక్కిసలాటకు కారణం అని అప్పట్లో వార్తలు వచ్చాయి.

మహారాష్ట్ర తొక్కిసలాట

2005 జనవరిలో మహారాష్ట్రలోని మంధరదేవి ఆలయంలో తొక్కిసలాట చోటు చేసుకుని.. ఏకంగా 265 మంది మృతి చెందారు. మంధర దేవి ఆలయానికి భారీగా భక్తులు తరలిరాగా.. అప్పుడు ఆ ఆలయానికి వెళ్లే మెట్లు జారుడుగా ఉండేవి. దీంతో ఒక్కసారిగా జనం ఒకరిపైకి మరొకరు పడటంతో తొక్కిసలాట చోటు చేసుకుంది.

హిమాచల్ ప్రదేశ్ తొక్కిసలాట

గత కొన్నేళ్లలో దేశంలో జరిగిన దుర్ఘటనలు ఇవే..!

హిమాచల్‌ప్రదేశ్‌లోని నయనాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 145 మంది దుర్మరణం పాలయ్యారు. 2008 ఆగస్టులో జరిగిన ఈ ఘటనకు కారణం.. అక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయని పుకార్లు రావడంతో భక్తులు పరుగులు తీశారు. ఫలితంగా తోపులాట, తొక్కిసలాట చోటు చేసుకున్నాయి.

చాముండేశ్వరీదేవి ఆలయంలో తొక్కిసలాట

రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో 2008లో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనలో 224 మంది మృతి చెందారు. సెప్టెంబర్ 30వ తేదీన జరిగిన ఆ ఘటనలో మరో 420 మందికి పైగా గాయాల పాలయ్యారు. బాంబు పేలిందనే భయంతో భక్తులంతా ఒక్కసారిగా పరుగులు తీయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి.

రత్నఘడ్ మందిరంలో తొక్కిసలాట

మధ్యప్రదేశలోని రత్నఘడ్ మందిరంలో 2013 అక్టోబర్ 13వ తేదీన నవరాత్రి సందర్భంగా తొక్కిసలాట జరిగింది. దాదాపు 1.50 లక్షల మంది భక్తులు రాగా.. అక్కడ ఉన్న ఒక బ్రిడ్జి కూలిపోయే పరిస్థితికి వచ్చిందని పుకార్లు వచ్చాయి. దీంతో అక్కడికి వచ్చిన భక్తులు ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ ఘటనలో ఏకంగా 115 మంది ప్రాణాలు విడిచారు.

భోలేబాబా సత్సంగ్ తొక్కిసలాట

2024లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలేబాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఫుల్‌రాయ్ అనే గ్రామంలో ఏర్పాటు చేసిన సత్సంగ్‌కు భారీగా భక్తులు తరలిరావడంతో 121 మంది మృతి చెందారు. భోలేబాబా పాదాల వద్ద ఉన్న మట్టిని తీసుకునేందుకు భక్తులు ఎగబడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు.

నీటి భద్రత, పారిశుధ్య విజయాలను దావోస్-25లో ప్రస్తావించిన భారత్

ఖైరతాబాద్, జనవరి 29 (జనం సాక్షి)

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్, నీటి భద్రత, పారిశుధ్యా నికి సంబంధించి భారత్ చేపట్టిన పరివర్తనాత్మ కమైన కార్యక్రమాలను దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలోని కీలక సెషన్లలో ప్రముఖంగా ప్రస్తావించినట్లు పర్యటన ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయంగా భాగ స్వామ్యాలను పెంపొందించుకోవడం, సుస్థిరాభివృ ద్ధి లక్ష్యాలను(ఎస్‌డీజీ) సాధించడంపై భారత్‌కి గల నిబద్ధతకు ఈ చర్చాగోష్టులు నిదర్శనంగా నిల్చాయన్నారు. 'ఫోస్టరింగ్ గ్లోబల్ కొలాబొరేషన్ ఫర్ ఎ వాటర్-సెక్యూర్ ఫ్యూచర్' అంశంపై జనవరి 24న జరిగిన సెషన్‌లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ప్రముఖ జల నిపుణులతో పాటు ప్రపం చవ్యాప్తంగా 300 మంది భౌతికంగా, వర్చువల్‌గా పాల్గొన్నారు. నీటి భద్రతను సాధించడంలో భారత నాయకత్వ విధానాల గురించి పాటిల్ ఇందులో వివరించారు. అంతర్జాతీయంగా నీరు, పారిశుధ్య సవాళ్లను పరిష్కరించడంలో అగ్రగామిగా కొనసా గుతూ, విజయాలు సాధిస్తున్నందుకు గాను దావో స్‌లో భారత్‌కు ప్రశంసలు దక్కాయి. సుస్థిరాభివృ ద్ధి విషయంలో దేశానికి గల నిబద్ధతను, వసుధైవ కుటుంబకం సూత్రానికి అనుగుణంగా అంతర్జా తీయ భాగస్వామ్యాలను పెంపొందించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని ఈ సెషన్లలో పాటిల్ పునరుద్ఘాటించారు.

స్మార్ట్ సిటీ పేరుమీద స్మార్ట్‌గా దోపిడీ

ఘనత మాజీ మేయర్ సునీల్ రావుకె దక్కుతుంది

కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్

కరీంనగర్ బ్యూరో, జనవరి 29 (జనం సాక్షి) :

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతిపై పోరాటం చేయమని చెప్పడం జరిగిందని మెండి చంద్రశేఖర్ విలేఖర్ల సమావేశంలో తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో కరీంనగర్ కార్పొరేషన్ లో అడ్డగోలు అవినీతి జరిగిందని జంక్షన్లు, సమీకృత మార్కెట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లాంటి వాటితో పాటు వివిధ పనుల్లో అడ్డగోలు అవినీతి జరిగిందని తెలిపారు. ఒకే ఒక్కడు అవినీతి అనకొండ అయిన మాజీ మేయర్ సునీల్ రావు పదవి కాలం ముగియడం తో మున్సిపల్ కార్పొరేషన్ కు పట్టిన శని విరగడయిందని, కుంభమేళా నుండి తీసుకువచ్చిన పవిత్రమైన గంగానీళ్లుతో కార్పొరేషన్ శుద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఎక్కడైనా ఇంటి టాక్స్, నల్లా టాక్స్ ఉండేది కానీ మన దగ్గర మాత్రం (ఎం టాక్స్) అంటే మేయర్ టాక్స్ పెట్టిందు, మొదట అతనికి టాక్స్ కట్టిన తర్వాతనే కార్యాలయంలో టాక్స్ కట్టాలని తెలిపారు. మాజీ మేయర్ తన సొంత మనుషులను ఏర్పాటు చేసుకొని రోజు పొద్దున్నే నాలుగు దిక్కుల తిప్పుతాడు ఎక్కడ ఎవరు ఇల్లు, అపార్ట్మెంట్ కట్టుకుంటున్నారో తెలుసుకొని (ఎం టాక్స్) మేయర్ టాక్స్ వసూలు చేసుకుని వస్తారన్నారు. బుధవారం స్మార్ట్ సిటీ లో అవినీతి జరిగిందంటూ మాజీ మేయర్ రే స్వయంగా వెళ్లి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిందు, ఐదు సంవత్సరాలు మేయర్ గా ఉన్నప్పుడు ఎందుకు ఫిర్యాదు చెయ్యలే? దొంగే దొంగ అన్న విధంగా ఉంది ఇతనీ తీరు. ఎస్ బిహెచ్ కాలనీ నుండి వచ్చే పెద్ద డ్రైనేజీ నీళ్లు మా దగ్గరి నుండి బొమ్మకులకు పోతవి, మా డివిజన్ డ్రైనేజీని స్మార్ట్ సిటీలో ఎందుకు పెట్టలేదు మేము టాక్స్ లు కట్టడం లేదా? అన్నారు. బిఆర్ఎస్ నుండి వచ్చే మాజీ కార్పొరేటర్ల మీద భూకబ్జా కేసులు ఉంటే మేము తీసుకోబోమని చెప్పిన బండి సంజయ్ అసలు అవినీతి కొండ కబ్జాదారుడైన సునీల్ రావుకు కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటివి ఇదేమి చోద్యం అన్నారు. బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు సునీల్ రావు పై ప్రెస్ మీట్ పెట్టి అవినీతి బయట పెడతా అంటే

పార్టీ పరువు పోతదని గంగుల కమలాకర్ నన్ను ఆపిందు, లేకపోతే ఈయన బండారం అప్పుడే బయట పెట్టేవాడినన్నారు.మేయర్ కాక ముందు నీ ఆస్తులు ఎంత ఈరోజు నీ ఆస్తులు ఎంత బయట పెట్టు. ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క కార్పొరేటర్ ప్రజావాణికి వెళ్లి ఫిర్యాదు చేయలేదు.

ఇప్పుడు నీ మీద ఫిర్యాదులు చేయడానికి ప్రజావాణి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని మెండి చంద్రశేఖర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఆరిఫ్, పడిశెట్టి భూమయ్య, ఉమాపతి, రోళ్ళ సతీష్, అమీర్, కుర్ర పోచయ్య, బొబ్బిలి విక్టర్, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి వాటాదారులు ఈనాడు ఒక్క పార్టీ అయ్యారు

కరీంనగర్ బ్యూరో, జనవరి 29 (జనం సాక్షి) :

బీజేపీ, టిఆర్ఎస్ పార్టీల అవినీతి అక్రమాలు వాళ్ళే స్వయంగా బట్టబయలు చేశారని ఆనాటి వాటాదారులు బండి సంజయ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావు ఒక్కటై ఒక్క పార్టీ అయ్యారని సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. పదేళ్లు బిఆరేస్ బిజెపితో అంటగాగి రెండు పార్టీలు కలిసి దోపిడీకి పాల్పడ్డాయని తాము ఆనాడు చేసిన ఆందోళనలు, విమర్శలు నేడు వాస్తవాలని వాళ్ళే ఒప్పుకుంటున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో భారీ అవినీతి అక్రమాలు జరిగాయని గతంలో సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేకసార్లు కార్యక్రమాలు చేపట్టాం ఇందుకు మీడియానే సాక్ష్యం అని స్మార్ట్ సిటీ పనుల నాణ్యత పై, ఆశాస్త్రీయ పనులపై చేసిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. మాజీ మేయర్ సునీల్ రావుతో కలసి దోపిడీకి పాల్పడ్డ ఆనాటి ఎంపీ, ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

నేడు ఒకే పార్టీగా కలవడం ఇది ముందే ఊహించిందే అని ఎప్పటినుండో వల్ల చీకటి ఒప్పందం లో భాగమే ఇది అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఐలాండ్, పార్కుల అభివృద్ధి పనుల్లో భారీ దోపిడి , క్షేత్రస్థాయిలో శాస్త్రీయంగా స్మార్ట్ సిటీ అవినీతి అక్రమాలను ఎండగట్టిన సిటీ కాంగ్రెస్ ఎప్పుడో వీరి చీకటి ఒప్పందాలను బయట పెట్టిందని నరేందర్ రెడ్డి అన్నారు. డంపింగ్ యార్డ్ కు రూ.16 కోట్ల కేటాయించుతే 16 గంటలు కూడా పని చేయలేదని ఆనాడు వాస్తవాలు మాట్లాడితే, టిఆర్ఎస్ కార్పోరేటర్లు సునీల్ రావుకు మద్దతుగా, తనపై విమర్శలు చేసింది వాస్తవం కాదా.. ఏది ఏమైనా నేడు స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఒప్పుకున్న టిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు , స్మార్ట్ పనుల అక్రమాలపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒప్పుకోవడం చూస్తే

అవినీతి, అక్రమాల్లో బీజేపి, బిఆరేస్ ఒక్కటే.. సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

అవినీతి అక్రమాల్లో బిజెపి, బీఆర్ఎస్ ఒక్కటే అని స్పష్టమౌతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నీతి నిజాయితీతో పని చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని స్పష్టమౌతుందనీ

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ తో గెలువబోతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుండటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, వాడ వెంకట్ రెడ్డి, శ్రవణ్ నాయక్, తమ్మడి ఎల్రా, జీడీ రమేష్, కుర్ర పోచయ్య, దన్న సింగ్, అస్తపురం రమేష్, మహేష్, మెతుకు కాంతయ్యా, మేరాజ్, షైనషా, భారీ, బషీర్, ఖలీల్, జమీల్, ఆశ్రఫ్, ఇమ్రాన్, షబానా, కవిత, మహాలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీజీఓ

తహశీల్దార్‌కు టీజీఓ డైరీ అందజేసిన నాయకులు

ఖమ్మం రూరల్, జనవరి 29 (జనం సాక్షి)

తెలంగాణ రాష్ట్రఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీఓ అండగా ఉంటుందని టీజీఓ ఖమ్మం జిల్లా సెక్రటరీ ఎం. వేలాద్రి అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్‌తహశీల్దార్ రాంప్రసాద్‌కు, అర్బన్ తహశీల్దార్ రవికుమార్‌లకు టీజీఓ ఖమ్మం జిల్లా సంఘం రూపొందించిన నూతన సంవత్సరం డైరీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సకలజనుల సమ్మె కాలంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని వారు గుర్తు చేశారు. గత పదేళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పేదలకు అందడంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని, ప్రభుత్వం, ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధిలా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ హౌజింగ్ సొసైటీ సెక్రటరీ పి. విజయ్, టీజీఓ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. రాంబాబు, టీజీఓ ఆఫీస్ సెక్రటరీ ఎం.డి. తాజుద్దీన్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి ఘన సన్మానం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29 (జనం సాక్షి)

నూతన తెలంగాణ రాష్ట్రకార్యదర్శిగా ఎన్నికైనటువంటి కామ్రేడ్ జాన్ వెస్లీ కి బుధవారం సన్మానం చేశారు. సంగారెడ్డిలో జరిగిన సిపిఎం రాష్ట్ర 4 రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల అనంతరం సిపిఎం నూతన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనటువంటి కామ్రేడ్ జాన్ వెస్లీకి కామారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గం కలిసి సన్మానించడం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ సిపిఎం నూతన కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎన్నిక కావడం రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మక ఘట్టమన్నారు. సిపిఎంలో సమరశీల పోరాటాలు, మిల్ టెన్స్ ఉద్యమాలు నడపడంలో జాన్ వెస్లీ ముందుంటున్నారన్నారు. అటువంటి నాయకుని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోవడం రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాలు రాష్ట్ర ప్రజానీకం తరపున ఉవ్వెత్తున ఉద్యమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వెంకట్ గౌడ్, కొత్త నరసింహులు, పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన

చిగురుమామిడి, జనవరి 29 (జనం సాక్షి)

చిగురుమామిడి మండలము ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పీఎం(ప్రధాన మంత్రి) కుసుమ్ కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఏర్పాటుకై స్థలాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీధర్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీఓ బాసం మధుసూదన్ లతో స్థల పరిశీలన చేశారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని డిఆర్డిఓ తెలిపారు. ఆయన వెంట డీపీఎం చింతల ప్రవీణ్, ఏపీఎం మట్టెల సంపత్, రెవెన్యూ పరిశీలకులు అరుణ్ కుమార్, సర్వేయర్ బాల మురళి కృష్ణ, సీసీ వెంకటమల్లు ఉన్నారు.

పోక్సో కేసులో నేరస్థుడికి ఐదేళ్ల జైలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 29 (జనం సాక్షి)

పోక్సో కేసులో నేరస్తునికి 5 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, 10 వేల జరిమానా విధింపు జిల్లా ఎస్పీ సింధుశర్మ బుధవారం వెల్లడించారు. బాలికపై లైంగిక దాడి కేసు పోక్సోలో నేరస్తుడు అయిన షేక్ కరీం అలియాస్ కరిముల్లా,కు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి గౌరవ లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 10ఏళ్ల మైనర్ బాలిక 2020 సెప్టెంబర్ 27న ఇంటి బయట అడుకుంటున్న చిన్నారిపై కామారెడ్డి మండలం, రాజీవ్ గృహ కల్ప వడ్లూరు చెందిన షేక్ కరీం అలియాస్ కరిముల్లా బాధిత బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో అమె ఏడుస్తూ తీవ్ర భయాందోళనకు గురై రోజువారి మాదిరిగానే మధ్యాహ్నం ఒకటి గంటలకు బీడీ కారుకనకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో 2020 సెప్టెంబర్ 27న స్థానిక దేవనిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయ మూర్తి నిందితులపై మోపిన నేరం రుజువు అయిందని 05 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించడం జరిగింది.ఈ కేసును సరియగు పద్ధతిలో విచారణ చేసిన అప్పటి కామారెడ్డి డిఎస్పి లక్ష్మీనారాయణ, సోమనాథం,ఎస్ఐ జ్యోతి, పోలీసు తరపున వాదనలు వినిపించిన అదనపు ప్రాసిక్యూటర్ శేషు, కోర్టు లో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి ఐపిఎస్, ప్రస్తుత ఎస్ఐ రాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ టి. మురళి, కోర్ట్ కానిస్టేబుల్ దేవిచంద్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

పోతుల సుభద్రమ్మ మృతి తీరని లోటు

మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి,జనవరి29 (జనంసాక్షి) :

పాన్ గల్ మాజీ సర్పంచు పోతుల కోదండ రాంరెడ్డి సతీమణి సుభద్రమ్మ మృతి గ్రామ ప్రజలకు తీరని లోటని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు .సుభద్రమ్మ మరణవార్త తెలుసుకున్న నిరంజన్ రెడ్డి బుధవారం పాన్ గల్ లోని ఆమె ఇంటికి వెళ్ళి మృతురాలి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ దివంగత కోదండ రాంరెడ్డి 11 ఏళ్ళ పాటు సర్పంచు పదవిలో కొనసాగిన సమయంలో ఇంటికి వచ్చిన వారందరికి సుభద్రమ్మ స్వయంగా భోజనాలు వండి ఆతిథ్యం ఇచ్చేదని గుర్తు చేశారు.గ్రామస్థులను ఆప్యాయంగా పలకరిస్తూ, అందరితో కలసిమెలసి ఉండేదని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో పాటు మాజీ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, పాన్ గల్ సింగిల్ విండో డైరెక్టర్ పేట బాలరాజు, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు అభిగేని రాంచందర్ రావు,బీఆర్ఎస్ నాయకులు మీనగె తిరుపతయ్య నాయుడు, భాస్కర్ రెడ్డి, నవీన్ రెడ్డి, కొంకల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఈడి, సిబిఐ నుండి తప్పించుకోవడానికే బిజెపి తీర్థం

మాజీ నగర మేయర్ సునీల్ రావుపై మహమ్మద్ తాజోద్దీన్ ఆరోపణలు

కరీంనగర్ బ్యూరో, జనవరి 29 (జనం సాక్షి) :

కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన మాజీ మేయర్ సునీల్ రావు ఈడి, సిబిఐ దాడుల నుండి తప్పించుకోవడానికే బిజెపి తీర్థం పుచ్చుకున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ తాజోద్దీన్ విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు మైనారిటీ నేతలతో కలిసి ఎండి తాజుద్దీన్ మాట్లాడుతూ.. అవినీతి నేతలను పార్టీలో చేర్చుకోవడం బిజెపికి అజెండాగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రతిరోజు ముస్లిం ఎంఐఎం నేతలపై విషం కక్కే బిజెపి నేతలు నిన్న ఎంఐఎం నేతలతో సన్మానాలు ఎలా చేయించుకున్నారని ప్రశ్నించారు. మాజీ మేయర్ సునీల్ రావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడం వల్ల వాస్తవాలు బయట పడ్డాయని అన్నారు. సునీల్ రావు అక్రమ ఆస్తులపై, నగరపాలక సంస్థ అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతామని మహమ్మద్ తాజుద్దీన్ పేర్కొన్నారు. ఎంతోమంది సీనియర్లు ఉండగా ఆనాడు సునీల్ రావుకు మేయర్ గా అవకాశం ఇచ్చిన బిఆర్ఎస్ నేతలు నేడు చీమల పుట్టలోకి పాములు దూరినట్లుగా సునీల్ రావు వ్యవహారం ఉందని మాట్లాడడం హాస్యాస్పదమని, గతంలో గ్రానైట్ కుంభకోణం, రాసలీలలు కేసులపై భయంతోనే ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బండి సంజయ్ పై నోరు మెదపడం లేదని, స్మార్ట్ సిటీ కమిషన్లు, ఇసుక అక్రమ రవాణా, గ్రానైట్ వ్యాపారం, అపార్ట్మెంట్ల నిర్మాణంలో కమిషన్లు, సెటిల్మెంట్లు, చీకటి వ్యాపారాలతో ఎమ్మెల్యే గంగుల, మాజీ మేయర్ సునీల్ రావు కోట్లకు పడగెత్తారని, వీరిద్దరి అక్రమ ఆస్తులపై సిబి, సిఐడి, డీజి, హోంమంత్రికి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదెల శ్రీధర్ బాబు రాష్ట్రాన్ని ఆర్థిక అభివృద్ధివైపు పరుగులెత్తించడానికి పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేపట్టి పెట్టుబడులు తీసుకొస్తుంటే, బిజెపి, బిఆర్ఎస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ లోకి, ఇప్పుడు బిజెపిలో చేరిన సునీల్ రావు తర్వాత తన పాత మిత్రుల ఎంఐఎం పార్టీలో చేరతారేమోనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశం లో సీనియర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు నిహాల్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ పాషా బాయ్, ఎండి చాంద్ పాషా, ఎండి సలీముద్దీన్, ఎండి కలీం, ఎం ఏ జమాల్, ఎస్ కె అజీమ్, ఎండి ఫెరోస్, ఆరీఫ్ ఖాన్, అబ్దుల్ కరీం, గౌస్, ఎండి ముజాహిద్, ఇక్రమ్, బహరుద్దీన్, ఎస్ డి జలీల్ అక్బర్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన లింగంపేట ఎస్సై సుధాకర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29 (జనం సాక్షి)

ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ లింగంపేట ఎస్సై సుధాకర్. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లోని హనుమాన్ జంక్షన్ వద్ద 12 వేల 500 ల రూపాయలు లంచం తీసుకుంటుండగా మాటువేసి పట్టుకున్న ఏసీబీ అధికారులు.. వాహనాలు అమ్మకాలు కొనుగోలు చేసే వ్యాపారి వద్ద నుండి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేదల పక్షాన పోరాటాలే సిపిఎం లక్ష్యం..

జిల్లాలో ఉపాధి రంగాలను పెంచాలి..

ప్రైవేటు సంస్థల్లో పేదలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)

పేదల పక్షాన పోరాటాలు చేయడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని, పేదల సమస్యలన్నీ పరిష్కరించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు బందు సాయిలు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎం పార్టీ మహాసభలు నాలుగు రోజులపాటు ఘనంగా జరిగాయని చెప్పారు. ఈ మహాసభల్లో ముఖ్యమైన సమస్యలు గుర్తించి 49 తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న సమస్యలను కూడా మహాసభల్లో చర్చించడం జరిగిందన్నారు. అనేక సమస్యలు జిల్లాలో ఉన్నాయని వాటికి నిధులు కేటాయించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్రానికి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, బొగ్గు శుద్ధి కర్మాగారం, ఎరువుల కర్మాగారం, స్టీల్, సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. తలాపునే ప్రాజెక్టులు, నదులు ఉన్నందున త్రాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి, జెన్కో మేడిగడ్డ ప్రాజెక్టు బాధితులకు పరిహారం పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. జిల్లాలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్లు ఏర్పాటు చేసి పేద వర్గాలకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీ పథకం వర్తింపజేయాలని, పేదలకు, కూలీలకు ఆయా పథకాల్లో అవకాశం కల్పించాలని కోరారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సమస్యలన్నీ పరిష్కరించాలని లేనట్లయితే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, గుర్రం దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, కుంజం బుదురాం, ఆకుదారి రమేష్, గడప శేఖర్, పార్టీ సభ్యులు ఎస్ డి అమిద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి రాష్ట్రపతి అభినందన

వరంగల్ ఈస్ట్, జనవరి 29 (జనం సాక్షి)

న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాజీ సైనికుడు సిరిమల్ల రాజేంద్రప్రసాద్ తో మాట్లాడి ఆయన ప్రచారం చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ యోజన పథకం ఉపయోగాలను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్రపతి ఆహ్వానితుడిగా హనుమకొండ జిల్లా మడికొండ గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ ఏట్ హెూమ్ కార్యక్రమానికి రాష్ట్రపతి ఆహ్వానితుడిగా ఆయన హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాలలోని ఏకైక వ్యక్తి ,ఉబయ వరంగల్ లోని హనంకొండ జిల్లా మడికొండ గ్రామం నుండి ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ యోజన పథకం క్రింద ఆయన మూడు కిలో వాట్ల సోలార్ కొనుగోలు చేయడం జరిగింది.సోలార్ విద్యుత్ వినియోగం, ప్రజల్లోకి ప్రచారం నిర్వహించి చైతన్యవంతులుగా చేసి స్వయంగా సోలార్ విద్యుత్ వినియోగిస్తున్న క్రమంలో ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎంపిక కావడం జరిగింది. దేశం మొత్తం నుండి ఐదుగురు వివిధ రంగాలలో కృషిచేసిన వ్యక్తులను ఎంపిక చేయడం జరిగింది అందులో హనంకొండ జిల్లాకు అరుదైన అవకాశం దక్కింది.

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కరానికి పోరాడతా

జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

గోవిందరావుపేట, జనవరి 29 (జనంసాక్షి)

: ఉపాధ్యాయ అధ్యాపకుల విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడారు. సి పి ఎస్, 317 జీవో బాధితులకు న్యాయం చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తానన్నారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల సమస్యలు సరిగా ప్రాతినిధ్యం జరగక పోవడం బాధాకరం అన్నారు.శాసన మండలిలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు సరిగా ప్రాతినిధ్యం జరగడం లేదని, ఫలితంగా అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని జక్టో మరియు అధ్యాపక, ఆచార్య సంఘాల ఎం.ఎల్.సి అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. గతంలో శాసన మండలి సభ్యునిగా పనిచేసిన కాలంలో అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొనిపోయి పరిష్కరించగలి గానని, ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 61 సం?లకు పెంపు, మొదటి తెలంగాణ పి ఆర్ సి లో 30% ఫిట్మెంట్ సాధన, సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ మరియు ఫ్యామిలీ పెన్షన్ సాధించడం, కేజీబీవీ ఉపాధ్యాయినిలకు 180 రోజుల మెటర్నిటీ సెలవు సౌకర్యం వంటివి సాధించి పెట్టగలిగానని తెలిపారు.గత ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటమి పాలైనప్పటికీ 6 సం?లుగా ఉద్యోగ,ఉపాధ్యాయ అధ్యాపక సమాజంలోనే వుంటూ వారి పోరాటాలకు మద్దతుగా నిలిచానని, ఎప్పటికప్పుడు వారి సమస్యలు ప్రభుత్వానికి చేరవేసే ప్రయత్నం చేసానని తెలిపారు.ఫిబ్రవరి లో జరుగబోయే ఎం ఎల్ సి ఎన్నికలలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎంఎల్ సి ఉపాధ్యాయ,అధ్యాపక మిత్రులందరూ మొదటి పాదాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు భవిష్యత్ లో ఏర్పడే ఖాలీలలో స్థానికత ఆధారంగా బదిలీ చేయటానికి ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని దీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా అధ్యక్షులు సిరుప సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి పోరిక శంకర్, గోవిందరావుపేట మండల అధ్యక్షులు బానోత్ విజయ్, తాడ్వాయి మండల అధ్యక్షులు కందిక రాజు తదితరులు పాల్గొన్నారు

వేగం కన్నా... ప్రాణం మిన్న

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ బ్యూరో, జనవరి 29 (జనం సాక్షి)

'వేగంకన్నా ప్రాణం మిన్న' అనే విషయాన్ని ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని, తనపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. చిన్న చిన్న నిర్లక్ష్యమైన తప్పిదాల కారణంగా ప్రతి ఏటా ఎన్నో కుటుంబాలు రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వాలంటీర్లకు, స్వయం సహాయక సంఘాలకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ సమావేశా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రజలలో ట్రాఫిక్ నిబంధనలు అవగాహన లోపం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించడం జరుగుతుందని వాటిని నివారించేందుకు గాను నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ట్రాన్స్పోర్ట్ మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ సహకారంతో ఈ నెల 17 నుండి 31 జనవరి వరకు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహింపబడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో యువతతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక సంఘాలుకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించిన వారమవుతావని తద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని ఆమె అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని ఆమె తెలిపారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి కలెక్టర్ కార్యాలయం నుండి అదాలత్ వరకు నిర్వహించే అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

నెహ్రు యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా పరిధిలోని గ్రామీణ వాలంటీర్లకు. స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు దోహదపడగలరని అభిలాషించారు. ఈ సమావేశంలో ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్,ట్రాఫిక్ ఏసిపి ముప్పాల శ్రీనివాస్ ఏపీడి సుధీర్ జిల్లాట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, సిఐ సీతారెడ్డి,నేషనల్ యూత్ అవార్డు గ్రహీత ఆకలపల్లి మధు జేడీఎం శ్రీనివాస్ ఎస్పై రామారావు తదితరులు పాల్గొన్నారు

దేశ పురోగాభివృద్ధికి యువతే కీలకం

డిఆర్డిఓ శాస్త్రవేత్త సతీష్ రెడ్డి

నిర్మల్ రూరల్, జనవరి 29 (జనంసాక్షి) :

ప్రపంచంలో భారతదేశం శాస్త్ర, సాంకేతికంగా,ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని,రానున్న రోజుల్లో భారతదేశం ప్రపంచానికి గురువు కావాలని డి ఆర్ డి ఓ మాజీ చైర్మన్,రక్షణ శాఖ సలహాదారు లు,శాస్త్రవేత్త బి.సతీష్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో నిర్వహించిన టాలెన్నియ 2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.పాఠశాల స్థాయి నుండి విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలని,విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ), స్పేస్ టెక్నాలజీ,సాఫ్ట్ వేర్,క్వాంటం ఫిజిక్స్ లను బోధించాలని తెలిపారు.దేశ అభివృద్ధికి యువత కీలకమని ఆయన అన్నారు.భారతదేశం ఎప్పుడు ప్రపంచ సుఖశాంతులను కోరుకుంటుందని,దేశం సుసంపన్నంగా,శక్తివంతంగా తయారైతే మనందరికీ కాకుండా ప్రపంచానికి మంచి జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా,వికసిత్ బారత్ గా ఎదుగుతుందని ఆయన తెలిపారు. 24 శాతంతో సుసంపన్నమైన దేశంగా ముందుకు వెళుతుందని ఆయన తెలిపారు.మన దేశం ప్రపంచానికి ఉపయోగపడే క్షిపణులను తయారు చేస్తుందే తప్ప నష్టపరిచే విధంగా ఉండదన్నారు. పాఠశాలలో 2040 లో తీసుకోబోయే భవిష్యత్ కార్యాచరణ పై విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్స్,ఉద్యోగాలు,సైబర్ సెక్యూరిటీ,ఇస్రో,డి ఆర్ డి ఓ,తదితర వాటిని సతీష్ రెడ్డి పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వాసవి పాఠశాల డైరెక్టర్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రటరీ జగదీశ్ రెడ్డి, అడ్వైజర్ మోహన్ రెడ్డి,కార్మిక శాఖ సహాయ కమిషనర్ ముత్యంరెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్,శ్రీనివాస్ శెట్టి, సుహాసిని,శైల,నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

2 లక్షల పైన ఉన్న రుణాలు కూడా మాఫీ చేయాలి

భూపాలపల్లి, జనవరి 29 (జనం సాక్షి)

2 లక్షల కు పైగా ఉన్న రైతుల బుణాలు కూడా త్వరితగతిన మాఫీ చేయాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ డిమాండ్ చేసారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజయ్య మాదిగ మాట్లాడుతూ. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాల రైతు రుణాలు మాఫీ చేస్తానని చెప్పింది కానీ క్షేత్ర స్థాయిలో పూర్తిగా 2 లక్షల లోపు ఉన్న రుణాలనే మాఫీ చేయడం దారుణం అని రాజయ్య మాదిగ మండి పడ్డారు. కొన్ని టెక్నికల్ కారణాల వల్ల చాల మంది రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ కూడా జరగక అనేక ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల రుణ మాఫీ చేయాలనీ డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాజయ్య మాదిగ హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ శీలపాక హరీష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీష్ మాదిగ, మలహార్ మండల అధ్యక్షులు మంత్రి రాజబాబు మాదిగలు పాల్గొన్నారు.

భూతగాదా విషయంలో మహిళ ఆత్మహత్యాయత్నం...!

రక్షించిన స్థానికులు, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది

చెన్నారావుపేట, జనవరి 29 (జనం సాక్షి)

భూతగాద విషయంలో మహిళ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన చెన్నారావుపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట గ్రామంలోని ఈర్య తండాకు చెందిన అజ్మీర రాందాన్, అజ్మీర రవి అనే ఇద్దరు అన్నదమ్ములకు గత కొద్ది రోజులుగా భూమి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గతంలో అనేక మార్లు దాడులు చేసి ఇద్దరు కొట్టుకున్నారు. అంతేకాక ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదులు చేసుకున్నారు. అయినా ఇప్పటివరకు తమ భూ సమస్య పరిష్కారం కాలేదు. బుధవారం చెన్నారావుపేట గ్రామ శివారులో పాత పోచమ్మ గుడి సమీపంలో అజ్మీర రవి భూమిని దున్నుకుంటుండగా ఎందుకు దున్నుతున్నావని తన అన్న అజ్మీర రాందన్ భార్య మంగమ్మ అడిగింది. దీంతో నా భూమిని నేను దున్నుకుంటున్నానని నీకు అవసరం ఉంటే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకోమని చెప్పాడు. దీంతో నేను పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని నువ్వు భూమి దున్నవద్దని చెప్పింది. అయినా వినకుండా భూమిని దున్నుతుండడంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. స్థానికులు గమనించి వ్యవసాయ బావిలో దూకి ఆమెను రక్షించారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వ్యవసాయ బావిలో నుండి మహిళను తాళ్ల సహాయంతో బయటకి తీశారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. ఈ విషయంలో పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

ప్రయాణాలు ఇలా.. ప్రమాదాల నివారణ ఎలా..!

ఖానాపూర్ జనవరి 30 (జనంసాక్షి)

రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత పై అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఓ పక్క అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో ముడి సరుకులను చేరవేయవలసిన వాహనాలలో ప్రయాణికులను చేరవేస్తూ ప్రమాదకరంగా వాహనాలు రోడ్డు పైన పరుగులు తీస్తున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి రోడ్డు నిబంధనలు పాటించకుండా ఇష్టా రీతిలో వాహన చోదకులు రోడ్డు పై ప్రయాణాలు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత శాఖల అధికారులు స్పందించి కట్టడి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

రాత్రికి రాత్రే అక్రమ టేల నిర్మాణం

తొలగించాలంటూ స్థానికుల ఆందోళన

మున్సిపల్ కమిషనర్,ఎస్సై ఆదేశంతేల తొలగింపు

నస్పూర్, జనవరి 29, (జనంసాక్షి)

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్త రోడ్ నేషనల్ హైవే (363) పక్కన గల ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి రాత్రికి రాత్రే అక్రమంగా టేలను నిర్మించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు బుధవారం ఉదయం పెద్ద ఎత్తున టేల వద్దకు చేరుకొని తొలగించాలని ఆందోళన నిర్వహించారు.టేల నిర్మించిన వ్యక్తికి చెందిన ఇల్లు జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోవడంతో అతనికి అధికారులు నష్టపరిహారంతో పాటు ఫ్లాట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.అయితే ఖాళీ స్థలంలో శ్రీరాంపూర్ జిఎం ఎల్వి సూర్యనారాయణ బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగిందని,దీంతో సదరు వ్యక్తి రాత్రికి రాత్రే అక్రమంగా టేలను నిర్మించారని తెలిపారు.అక్రమంగా నిర్మించిన టేలను తొలగించి బస్టాండ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఘటన స్థలానికి చేరుకున్న శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్థానికులు ధర్నా విరమించారు.మున్సిపల్ కమిషనర్,ఎస్సై సంతోష్ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని సదరు వ్యక్తికి చెప్పడంతో టేలను తొలగించాడు.ఈ కార్యక్రమంలో స్థానికులు బొడ్డు ప్రభాకర్,బుగ్గయ్య, కొంకటి మొగిలి,తిరుపతి,తోకల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు తొందరగా పూర్తి చేయాలె..

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలె..జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)

నూతన గ్రంథాలయంలో పెండింగ్ పనులు తొందరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి అధికారులతో చర్చించి గ్రంథాలయ భవనానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా కృషి చేస్తామని, త్వరలోనే గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాలు అమర్చడం కోసం అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, పుస్తక విభాగం, పత్రికల విభాగాలకు వేర్వేరు పార్టిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రస్తుతం ప్రాంగణంలో ఉన్న సెల్ టవర్ పక్క నుంచి ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి అధికారులతో చర్చించి గ్రంథాలయ ప్రాంగణంలో ఉన్న కర్రను తొలగించే చర్యలు కూడా తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, తహసిల్దార్ శ్రీనివాసులు, ఏఈ మహేందర్, గిర్దావర్ రామస్వామి, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 జనవరి 2025

ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక శిబిరాన్ని ఎత్తివేయాలని

అధికారుల ఒత్తిడి

తీవ్రంగా ఖండించిన పోరాట కమిటీ

రాజోలి (జనంసాక్షి) : గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ శాంతియుత, గాంధేయ మార్గంలో కొనసాగుతున్న ఆందోళనలపై అధికారుల ఒత్తిడి తీవ్రమవుతోంది. ఒకవైపు గుట్టుగా పనులు మొదలు పెట్టాలని యాజమాన్యం యత్నిస్తుంటే.. హామీనిచ్చినట్టే ఇచ్చి దీక్షలు విరమించాలని ప్రభుత్వాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఏడో రోజుకు రిలే దీక్షలు చేరిన సందర్భంగా బుధవారం గద్వాల ఆర్డీవో, డీఎస్పీ కలిసి రైతులను చర్చలకు పిలిచారు. ఈ సందర్భంగా ఎలాంటి ఆందోళనలూ చేపట్టవద్దని, శిబిరాన్ని ఎత్తివేయాలని చెప్పడంతో పోరాట కమిటీ సభ్యులు ససేమీరా అన్నారు. అధికారుల ఒత్తిడిని వారు తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దయ్యే వరకూ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతామని, ప్రజలు జరుపుతున్న శాంతియుత పోరాటంపై ఎలాంటి ఒత్తిళ్లు తేవొద్దని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్లు జయరాంరెడ్డి, నర్సింహులు, అలెగ్జాండర్ కోరారు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా దీక్షలు కొనసాగబోవని, స్వతంత్రంగానే పోరాడుతామని, ఇందులో ఎవరు మద్దతునిచ్చినా స్వీకరిస్తామని పోరాట కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. అధికారుల చర్యలను ప్రజలు, ప్రజాస్వామి కవాదులు ఖండించాలని ఈ ప్రకటనలో వారు కోరారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా

కదిలిన పల్లెలు

కదం తొక్కిన వందలాది రైతులు

- ప్రజల నిర్ణయమే మా నిర్ణయం ఎవరూ ఆందోళన చెందొద్దు
- పోరాటంలో చివరికి విజయం మనదే..
- త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్తా..
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

రాజోలి, జనవరి 29 (జనంసాక్షి) : పెద్ద ధన్వాడ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పల్లెలు కదొలిచ్చాయి. రైతన్నలు కదం తొక్కి నిరసన దీక్షకు మద్దతు పలికారు. రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రైతులకు మద్దతు తెలిపారు. ఈ నిరసన దీక్షకు వందలాది మంది రైతులు పాల్గొని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటాం : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

రిలే నిరాహార దీక్షకు ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ చల్లా, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రైతులు సంఘటితంగా చేస్తున్న పోరాటాన్ని తాము అభినందిస్తున్నామని తెలిపారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడంతో అక్కడున్న ప్రజలకు పెద్ద ఊరట లభించిందని, తప్పకుండా మన ప్రాంతంలో కూడా ఇథనాల్ పరిశ్రమ రద్దవుతుందని తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజలు ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నారనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తమని హామీచ్చారు. ప్రజల నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, ప్రజల నిర్ణయమే తమ నిర్ణయమని వారి కోసమే మేం ఉన్నామన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఆగిపోయే వరకు చర్యలు తీసుకుంటానని తేల్చి చెప్పారు. అలాగే ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసిన రైతులపై ఎటువంటి కేసులు పెట్టవద్దని పోలీసు అధికారులకు సూచిం చారు. పరిశ్రమ పనులు తక్షణమే నిలిపి వేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చెప్పుకొ చ్చారు. విజ యం సాధించేవరకు రైతులు, యువకులు వెనకడుగు వేయద్దన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా తమ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు, సంకాపురం రాముడు, వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ కరుణ సూరి, యువ నాయకులు ఆర్ కిషోర్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభయహస్తం పథకాన్ని

ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి

- సెస్, చేనేత జౌళి శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష
- హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) : చేనేత అభయ హస్తం పథకాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సెస్,చేనేత శాఖ అధికారులతో బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహకార విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్, సిరిసిల్ల (సెస్) నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను రైతులకు, పవర్ లూమ్ పరిశ్రమకు అందించాలని సెస్ అధికారులను మంత్రి ఆదేశించారు. అదనంగా ట్రాన్స్ ఫార్మర్లను అందుబాటులో ఉంచుకొని, సమస్య వచ్చిన వెంటనే మార్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా విద్యుత్ రెగ్యులేటరి కమిషన్ నియమాల ప్రకారం సంస్థను నడిపించాలన్నారు. సంస్థ సిబ్బంది ప్రజాప్రతినిధులను కలుపుకొని వారి సూచనల మేరకు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు.చేనేత అభయ హస్తము పథకంను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలన్నారు.ఈ పథకమును త్వరితగతిన అమలు చేయుటకు నేత కార్మికులకు అవగాహన కార్యక్రమములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మరమగ్గాల యూనిట్లకు 25 హెచ్పి వరకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ అమలు చేయాలన్నారు. యారన్ డిపో ద్వారా ఆసాములకు మాత్రమే నూలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆసాములకు నూలుకు అవసరమగు పెట్టుబడిని బ్యాంకుల ద్వారా అందజేయుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఆసాములు ఇతరుల మీద ఆధారపడకుండా స్వయంగా నూలు కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.యారన్ డిపోలో నూలు స్టాకులను పెంచి నూలు కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.జీవో ఎమ్మెస్ ప్రకారం 18.03.2024 ఏయే శాఖలు ఇప్పటిదాకా తమకు కావాల్సిన వస్త్ర ఇండెంట్లు టెస్కోకు సమర్పించడం లేదో ఆయా శాఖలు మీద చర్యలు తీసుకొనుటకు,చేనేత సహకార సంఘాలకు మరియు పవర్ లూమ్ సంఘాలకు టెస్కో ద్వారా చెల్లించవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.సిరిసిల్ల సెస్ మరియు చేనేత అంశాలపైన మంత్రికి కేకే మహేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశాలలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు , సహకారశాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్,హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సెస్ అధికారులు,ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పును వక్రీకరించి ప్రచారం చేశారు

- ఎక్స్ వేదికగా జానిమాస్టర్ ట్వీట్

హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : టాలీవుడ్ టాప్ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారారు. జూనియర్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్టై.. బెయిల్‌పై బయటకొచ్చిన ఆయన.. తాజాగా సంచలన ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు సెన్సేషనల్‌గా మారింది. సోషల్ మీడియాలో పోస్ట్ ఎవరిని ఉద్దేశించి చేశారు.. ఆయన అంతలా రియాక్ట్ అవడానికి కారణం ఏంటి ఈ కథనంలో తెలుసుకుందాం. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న జానీ మాస్టర్.. కొన్నాళ్లు జైలు జీవితం గడిపారు. ఆ తరువాత బెయిల్‌పై బయటకొచ్చారు. కానీ, ఈ వ్యవహారంతో జానీ మాస్టర్ స్టార్ డమ్ మొత్తం కొలాప్స్ అయిపోయింది. బాధిత యువతి 'మా' అసోసియేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో.. 'మా' అసోసియేషన్ ఆయనపై చర్యలు తీసుకుంది. డ్యాన్స్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడిగా జానీ మాస్టర్‌ని తొలగించింది. ఆ తరువాత నేషనల్ అవార్డ్ సైతం వెనక్కి తీసుకున్నారు. అయితే, జానీ మాస్టర్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించిన క్రమంలో మా అసోసియేషన్ కొత్త అధ్యక్షుడి కోసం ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలపై జానీ మాస్టర్ కోర్టును ఆశ్రయించారు. ఇక్కడ కూడా జానీ మాస్టర్‌కు ఎదురు దెబ్బ తగిలింది. పిటిషన్‌ను కొట్టేసింది. ఈ క్రమంలో సినీ పరిశ్రమకు చెందిన పలువురు కోర్టు తీర్పును వక్రీకరించి ప్రచారం చేస్తున్నారంటూ జానీ మాస్టర్ రియాక్ట్ అయ్యాడు. వారి తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

మహాకుంభమేళాకు మరో ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : మహాకుంభమేళాకు వెళ్లాలనుకునే భక్తులకోసం మరో 4 ప్రత్యేకరైళ్లను నడపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందులో రెండు ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి 5, 7 తేదీల్లో చర్లపల్లి నుంచి దానాపూర్‌కు, 7, 9 తేదీల్లో మరో రెండు రైళ్లు తిరుగు ప్రయాణంలో దానాపూర్ నుంచి చర్లపల్లికి రానున్నాయి. మార్గమధ్యంలో ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బలార్ష, చంద్రాపూర్, సేవాగ్రమ్, నాగ్‌పూర్..తదితర స్టేషన్లలో ఈ ప్రత్యేక రైళ్లకు హాల్ట్ ఏర్పాటు చేసినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

త్రిషకు కల్వకంట్ల కవిత అభినందనలు

హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

విదేశీ అమ్మాయిలతో వ్యభిచారం

- దాడి చేసి పట్టుకున్న ఎస్‌వోటి పోలీసులు

హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో సెక్స్ రాకెట్ గుట్టు రట్టు అయ్యింది. గౌలిదొడ్డి టీన్జీఓస్ కాలనీలో ఓ యువకుడు.. ఫారిన్ అమ్మాయిలతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. కెన్యా, టాంజానియా, బ్యాంకాక్ అమ్మాయిలతో వ్యభిచారం నడుపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. కాలనీలోని వ్యభిచార గృహంపై మాదాపూర్ ఎస్ఓటీ, హెచ్ టీఎఫ్ అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించి.. 9 మంది ఫారిన్ అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు.విషయం తెలుసుకున్న నిర్వాహకుడు పోలీసులకు దొరకకుండా పరారయ్యాడు. దీంతో పోలసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వడ్లకొండ కృష్ణ హత్య కేసులో ఆరుగురు భార్గవి కుటుంబ సభ్యుల అరెస్ట్

సూర్యాపేట, జనవరి 29 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన పరువు హత్య కేసులో బుధవారం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. భార్గవి ఇద్దరు సోదరులు, నానమ్మ, నాన్న సహా ఆరుగురు అరెస్ట్ అయ్యారు. ఆరు నెలల క్రితం వడ్లకొండ కృష్ణ(30), భార్గవి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్నందుకు కక్షగట్టిన ఆమె సోదరులు కృష్ణను హత్య చేశారు. సోమవారం పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది. కృష్ణను చంపుతానని పలుమార్లు భార్గవి సోదరుడు నవీన్ బెదిరించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. పరువు హత్య కేసులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. వడ్లకొండ కృష్ణను హత్య చేసేందుకు భార్గవికి చెందిన కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నారు. సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్డు సమీపంలోని నిందితుల్లో ఒకరైన బైరు మహేశ్ వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తెల్లవారుజాము వరకు షికారు చేశారు. చివరికి పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వకట్టపై మృతదేహాన్ని వదిలేసి నిందితులందరూ పరారయ్యారు. ఇష్టం లేకుండా తమ సోదరి భార్గవిని వివాహం చేసుకోవడంతో రెండు నెలలుగా కృష్ణను అంతం చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఇందులో తాళ్లగడ్డకు చెందిన బైరు మహేశ్‌తో పాటు నల్గొండకు చెందిన మరో యువకుడి సాయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే కొన్నాళ్లుగా కృష్ణతో.. మహేశ్ స్నేహం చేస్తున్నట్లు నటించాడు. ఈ పథకాన్ని ఈనెల 19న అమలు చేయాలని చూసినా.. కుదరక ఆదివారం రాత్రి హత్య చేశారు.

ప్రయాగ్ రాజ్‌లో ఘటన దురదృష్టకరం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

వరంగల్ ఈస్ట్, జనవరి 29 (జనం సాక్షి) : ప్రయాగ్ రాజ్ లోని మహాకుంభ మేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన పట్ల మంత్రి సురేఖ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు, మరికొందరు గాయాలపాలు కావడం పట్ల మంత్రి సురేఖ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. 70 ఏళ్ళ క్రితం ప్రయాగ్ రాజ్ లో జరిగిన కుంభమేళాలో మౌని అమావాస్య రోజునే జరిగిన తొక్కిసలాటలో వందల సంఖ్యలో భక్తులు మరణించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేసుకున్నారు. ఈ ప్రమాదాన్ని దురదృష్టకర సంఘటనగా మంత్రి సురేఖ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వసంత పంచమి, అచల నవమి, మహాశివరాత్రి వంటి ముఖ్యమైన రోజులున్నందున మహాకుంభ మేళాకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చే పరిస్థితుల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సురేఖ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయాలపాలైన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ములుగు ఓఎస్డి గీతె మహేష్ బాబా సాహెబ్

ములుగు బ్యూరో, జనవరి 29(జనం సాక్షి): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ములుగు ఓఎస్డీ గీతె మహేష్ బాబా సాహెబ్ అన్నారు. డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రోడ్ భద్రత మాసోత్సవలలో భాగంగా ములుగు పోలీస్ శాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది వాహనాదరులకు (లారీ,ఆటో,టాటా మాజిక్, టూ వీలర్) రోడ్ భద్రత గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు ఓఎస్డి గీతె మహేష్ బాబా సాహెబ్ హాజరై మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వారిపై వారి యొక్క కుటుంబం ఆధారపడి ఉన్న విషయం గుర్తుంచుకోవాలని అదేవిధంగా ములుగు జిల్లాలో చాలా వరకు జరిగిన రోడ్ ప్రమాదాల్లో హెల్మెట్ లేకుండా బైక్ డ్రైవ్ చేయడం, రాంగ్ రూట్లో రావటం అదేవిధంగా తాగి వాహనాలు నడపటం మూలంగా జరిగినవి అని కాబట్టి వాహనదారులు తప్పకుండ రోడ్ భద్రత నియమాలు పాటించాలని, ఫిబ్రవరి నుండి రోడ్ భద్రత నియమాలను పాటించని వారి పట్ల చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి ఎన్.రవీందర్, ములుగు సీఐ వి.శంకర్, ములుగు ఆర్టిఓ శ్రీనివాస్ మరియు ములుగు ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

భర్తకు విషం పెట్టి చంపిన భార్య

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని.. తినే ఆహారంలో విషం కలిపి భర్తను చంపేసింది కట్టుకున్న భార్య.. కామంతో కళ్లు మూసుకుపోయి భర్తను హత్య చేయడమే గాకుండా ఏమి తెలియనట్లు నటించి చివరకు పోలీసులకు లొంగిపోయింది.. సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం శివారు కాసింపల్లిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం శివారు కాసింపల్లికి చెందిన కందుల సురేష్(37) అనే లారీ డ్రైవర్ ఈ నెల 27న రాత్రి తన ఇంటిలో నిద్రించి, ఉదయం లేచేసరికి నోటి నుండి నురుగు కారుతూ చనిపోయి ఉన్నాడు. ఈ విషయంపై మృతుని తల్లి తన కమారుడు మృతి విషయంలో కోడలు కందుల స్వప్న పై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం రోజున మృతిని భార్య కందుల స్వప్న స్థానిక పోలీస్ స్టేషన్ లో కు లొంగిపోయి అసలు విషయం చెప్పింది. తన భర్త కందుల సురేష్ తన అక్రమ సంబంధం కు అడ్డువస్తున్నాడని ఈ నెల 26 న రాత్రి అతడు తినే ఆహారంలో విష పదార్థం ఇచ్చి ఆ తర్వాత ముఖంపై బొంతతో అదిమి పట్టి చంపానని చెప్పడంతో పోలీసులు ఖంగుతిన్నారు. తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో ఆమెను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సీఐ వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370